# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 17 డిసెంబరు 2024




రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

# తొలి స్నాతకోత్సవానికి ఎయిమ్స్ ముస్తాబు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న రాష్ట్రపతి
- నలుగురికి బంగారు పతకాలు
- పాల్గొంటున్న గవర్నర్, సీఎం



మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి భవన సముదాయం

మంగళగిరి ఎయిమ్స్ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి బ్యాచ్ పూర్తి చేసుకుని పట్టాలను పొందుతున్న 47 మందిలో 17 మంది మహిళలు కాగా, మిగిలిన 30 మంది పురుషులే! మొత్తం 47 మందిలో నలుగురికి మాత్రం ఎయిమ్స్ యాజమాన్యం బంగారు పతకాలను ప్రకటించింది. ఈ నలుగురిలో ముగ్గురు మహిళలు కాగా ఒక్కరు మాత్రమే పురుషుడు. లియా ఆజీ, సుప్రభా సిన్హా, వీకే ఆధీరా, దాసరి దివ్యాన్షు అనే నలుగురికి బంగారు పతకాలను ప్రకటించారు.

**నలుగురికి బంగారు పతకాలు**

మంగళగిరి ఎయిమ్స్ చిహ్నం

మంగళగిరి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొదటి బ్యాచ్ మెడికోలు తమ గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా తొలి స్నాతకోత్సవాన్ని పాలకవర్గం మంగళవారం మధ్యాహ్నం వేడుకగా జరిపేందుకు సన్నద్ధమైంది. ఈ వేడుకకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఆయుష్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ స్నాతకోత్సవం మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఎయిమ్స్ ఆవరణలోని ఆడిటోరియంలో ప్రారంభమై గంటన్నరపాటు కొనసాగుతుంది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము స్నాతకోత్సవ ప్రసంగంచేసి ప్రతిభ చూపిన నలుగురు వైద్య విద్యార్థులకు బంగారుపతకాలను అందజేస్తారు. అలాగే, ఎంబీబీఎస్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న 47 మందితోపాటు పోస్టు డాక్టొరల్ సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసుకున్న మరో నలుగురు విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తారు.

### విభజన వరాల్లో ఒకటి

రాష్ట్ర విభజన వరాలలో ఒకటిగా మంగళగిరిలో ఎయిమ్స్ ఆసుపత్రి ఏర్పాటయింది. గతంలో ఒక్క దేశ రాజధాని ఢిల్లీకి మాత్రమే పరిమితమై ఉన్న అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ సేవలను దేశ ప్రజలందరికీ అందించాలన్న బీజేపీ ప్రభుత్వ సంకల్ప కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా పలు ఎయిమ్స్ ఆసుపత్రుల స్థాపన దశలవారీగా ఆరంభమైంది. ఇందులో.. ఫేజ్-4లో భాగంగా ఏపీకి రూ. 1618 కోట్ల వ్యయంతో ఎయిమ్స్ ఆస్పత్రిని మంగళగిరిలో ఏర్పాటు చేసేవిధంగా (మిగతా 8వ పేజీలో)



స్నాతకోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి



- పెరుగుతున్న శ్వాసకోశ సమస్యలు!
- జలుబు, దగ్గు లక్షణాలతో పిల్లలు విలవిల
- ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కారణమంటున్న వైద్యులు
- ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలకు పెరుగుతున్న చిన్నారులు

# చిన్నారులపై.. చలి పంజా

వాతావరణంలో కొద్దికాలంగా చలి పెరిగింది. ఉదయం పొగ మంచు కురుస్తోంది. మారిన వాతావరణ పరిస్థితులు చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చలి వాతావరణంలో ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ప్రబలుతుం డటంతో చిన్నారులు జలుబు, దగ్గు, ఆయాసం, జ్వరం, శ్వాసకోశ సమస్యలతో సతమతమవుతున్నారు. ఆయా సమస్యలతో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శిశు వైద్య విభాగంతో పాటు గుంటూరులోని పలు ప్రైవేటు చిన్న పిల్లల ఆస్పత్రులకు వస్తున్న బాధిత పిల్లల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఏడాదిలోపు చిన్నారుల్లో బ్రాంకైటిస్, ఆయాసం, దగ్గు, డొక్కలు ఎగరేస్తూ ఇబ్బందిపడుతున్నారు. గతంలో రోజుకు 150 మంది వరకు ఓపీ విభాగానికి వస్తుంటే, వ్యాధుల ప్రభావంతో ప్రస్తుతం ఓపీ సంఖ్య 200కు చేరినట్లు పీడియాట్రిక్ వైద్యులు చెబుతున్నారు.



గుంటూరు మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చలి పెరడగంతో ఇన్‌ఫ్లుయెంజా ఏ, అడెనో వైరస్, వంటివి విజృంభిస్తున్నాయి. పది రోజులుగా వీటి ప్రభావంతో దగ్గు, జలుబు, ఆయాసంతో పాటు ఊపిరితిత్తుల్లో గాలి గొట్టాల వాపుతో చిన్నారులు విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్న ఓపీలో 80 శాతం మంది చిన్నారుల్లో ఈ ఇబ్బందులే కనిపిస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. గుంటూరు నగరంలో సుమారు 40 వరకు చిన్న పిల్లల ఆస్పత్రులు ఉన్నాయి. ఒక్కొక్క చోట ప్రతి రోజూ 60 నుంచి 100 వరకు ఓపీలు నమోదవుతున్నాయి. ఇదే అదనుగా కొన్ని ఆస్పత్రుల్లో ఓపీలు పెంచడంతో పాటు కార్డు పని చేసే కాల వ్యవధిని 15 రోజుల నుంచి పదికి, పది రోజుల నుంచి వారానికి కుదించేస్తున్నారు. పరీక్షలకు సంబంధించి ప్రైవేటు ల్యాబుల్లో రూ.వేలు ఖర్చవుతున్నాయి.

### మధ్యస్థ తరహా వ్యాధి లక్షణాలు..

ఇన్‌ఫ్లుయెంజాను ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల్లో సమస్యలు సృష్టించే వైరస్‌గా చెప్పవచ్చు. దీన్నే సీజనల్ ఫ్లూగా పిలుస్తారు. ఇందులో (మిగతా 6వ పేజీలో)

## ఎస్‌ఏ -1 గణితం

# పరీక్ష రద్దు



- ప్రశ్న పత్రాలు.. యూట్యూబ్‌లో ప్రత్యక్షం
- ప్రశ్న పత్రాలన్నీ పోలీసుస్టేషన్‌కు తరలింపు

పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాల బాక్సులు

గుంటూరు విద్య, డిసెంబరు 16 ఆంధ్రజ్యోతి: ఉమ్మడి జిల్లాలో సోమవారం జరగాల్సిన ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రాలు ముందుగానే యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో సోమవారం జరగాల్సిన పరీక్షల్ని విద్యాశాఖ రద్దుచేసింది. రాష్ట్రంలో ఏ జిల్లా నుంచి ప్రశ్నపత్రం లీక్‌అయిందనే విషయం విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులకు ఈనెల నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పరీక్షలకు 6వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులు హాజరవుతున్నారు. తాజాగా సోమవారం జరగాల్సిన పది గణితం ప్రశ్నపత్రం ఆదివారం రాత్రి నుంచే యూట్యూబ్‌లో ప్రత్యక్షమైంది. దీంతో అప్రమత్తమైన రాష్ట్రస్థాయి అధికారులు గణితం పరీక్ష రద్దుచేస్తున్నట్లు ఉదయం డీఈవోలకు సమాచారం పంపారు. వెంటనే డీఈవోలు సమాచారాన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు పంపడంతో సోమవారం పరీక్ష రద్దు అయింది.

### ప్రశ్నపత్రాల బాక్సులు పోలీస్ స్టేషన్లకు....

ఎస్‌ఏ-1 పరీక్షలకు సంబంధించి ఇంకా మూడు సబ్జెక్టుల పరీక్షలు జరగాల్సి ఉంది. ప్రశ్నపత్రాల లీకేజీపై ఎంఈవోల స్థాయిలో సోమవారం సాయంత్రం హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రశ్న పత్రాలను సమీపంలోని పోలీసు స్టేషన్లకు తరలించాలని విద్యాశాఖ అధికారులు హెచ్‌ఎంలకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఒక్కో పాఠశాలకు వచ్చిన ప్రశ్నపత్రాల బాక్సులు మూడు, నాలుగు ఉన్నాయి. ఆయా బాక్సుల్ని స్టేషన్‌కు తరలించడానికి హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది. ప్రతిరోజు ఉదయం వాటిని స్టేషన్ నుంచి తీసుకురావడం మరలా పరీక్షలు నిర్వహించడం ఓ ప్రహసనంగా మారిందని, ఇందుకు అయ్యేరవాణా ఖర్చులు తాము భరించాల్సి వస్తోందని వారు వాపోయారు.

### ప్రతిసారి ఎలా లీక్‌అవుతున్నాయో?

పాఠశాలల్లో జరిగే పరీక్షలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రశ్న పత్రాలు సిద్ధం చేసి వాటిని జిల్లాకామన్ ఎగ్జామినేషన్ బోర్డుకు పంపుతారు. అక్కడి నుంచి ఎంఈవో కార్యాలయాలకు, తరువాత స్కూల్ కాంప్లెక్సులకు ఇవి సరఫరా చేస్తారు. అయితే గత ప్రభుత్వం ప్రశ్నపత్రాల సరఫరాపై తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కొన్నిసార్లు పరీక్షకు ఒక రోజు ముందు వాట్సప్‌లో పెట్టడం వాటిని డౌన్‌లోడు చేసుకుని ఉపాధ్యాయులు బోర్డుపై రాయడం లేదా జిరాక్స్ తీసి పంపిణీ చేయడం చేశారు. ఫలితంగా అనేక సార్లు ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయి. అయినా పట్టించుకోకుండానే పరీక్షలు నిర్వహించారు. ఇటువంటి అవ లక్షణాల్ని కొత్త ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఫలితంగా పరీక్షల్ని రద్దుచేసి ప్రశ్నపత్రాలను పోలీసుస్టేషన్లకు తరలించినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే ఇందులో ఉండే వ్యయ ప్రయాసలు కూడా ప్రభుత్వం అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జూనియర్ కళాశాలల్లో..

# నిబంధనలకు తూట్లు

- ఒకచోట అనుమతి తీసుకుని మరొక చోట తరగతులు
- నోటీసులతో సరిపెడుతున్న ఇంటర్‌బోర్డు....క్షేత్రస్థాయిలో తనిఖీలేవీ!
- నోటీసులు ఇచ్చి జరిమానా విధించినా తీరుమారని వైనం
- ప్రభుత్వానికి వివిధ ఫీజుల రూపంలో భారీ గండి
- ముంచుకొస్తున్న పరీక్షలు...... విద్యార్థులకు అగచాట్లు తప్పేనా?

గుంటూరు(విద్య),డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కళాశాల నిర్వహించేది ఒకచోట, అడ్రసు మరో చోట..... తీరా అడ్రసులో కళాశాల గురించి వాకబు చేస్తే అక్కడ కళాశాల ఎప్పుడో ఎత్తివేశారని సమాధానం వస్తుంది. ఒక్కోసారి అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు కళాశాల మారినట్లు ధ్రువీకరించుకోవాల్సిన దుస్థితి ఇంటర్‌బోర్డులో నెలకొంది. ఇలా ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ బోర్డు నిబంధనలకు తూట్లు పొడిచి ఇష్టారాజ్యంగా కళాశాలల్ని నిర్వహిస్తున్నా బోర్డు అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో ఇలా నిబంధనలు తుంగలో తొక్కిన 15 కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్ని గుర్తించిన ఇంటర్ బోర్డు భారీ జరిమానా విధించినా యాజమాన్యాల్లో మార్పు రావడం లేదు. ఇప్పటికే పరీక్షల షెడ్యూల్ విడుదలైనా ఇంటర్ బోర్డు అధికారులు మేలుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, కాంపోజిట్, ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు దాదాపు 360 వరకు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం 48,386 మంది, ద్వితీయ సంవత్సరం 49,390 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇందులో సింహభాగం ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లోనే విద్యార్థులు చదువుతున్నారు. ప్రారంభంలో ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు చేయడం తరువాత విద్యార్థుల్ని తమ ఇష్టం వచ్చినట్లు అనుమతి లేని ప్రాంతాలకు తరలించడం ఏటా పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో రెండు సంవత్సరాల ఇంటర్ బోర్డు అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇందులో అనేక కళాశాలలు దరఖాస్తుచేసిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆయా కళాశాలలకు నోటీసులు జారీ చేసి పెద్దమొత్తంలో జరిమానా విధించినట్లు తెలిపారు.

### నగరం, పట్టణాల్లోనే అత్యధిక ఉల్లంఘనలు....

ఒకచోట అనుమతి తీసుకుని మరొక చోట తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలు గుంటూరు, మున్సిపల్ పట్టణాల్లో అత్యధికంగా ఉన్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. గతంలో ఇలాంటి 15 కళాశాలల్ని ఒక్కో కళాశాలకు రూ. 2.50లక్షల చొప్పున జరిమానా విధించారు. మరోవైపు అనుమతి లేకుండా కళాశాలల్ని నిర్వహిస్తున్న విషయం కూడా వెలుగులోని రావడంతో ఆయా కళాశాలలకు రూ. 5లక్షల వరకు జరిమానా విధించారు. నగరంలో ఒక చోట కళాశాలకు అనుమతి తీసుకుని మేడికొండూరు, చినపలకలూరు, పెదపలకలూరు, నల్లపాడు శివారు, చల్లావారిపాలెం, గోరంట్ల తదితర ప్రాంతాల్లో కళాశాలల్ని నిర్వహిస్తున్నారు. అసలు 90శాతంపైగా ప్రైవేటు కళాశాలలకు ఆటస్థలాలు లేవని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. నగరంలోని అపార్టుమెంట్స్‌లో భారీగా అద్దెలు పెరగడం,నీరు ఇతర అవసరాల దృష్ట్యా కళాశాలల్ని శివారు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటువంటి కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు పడినప్పుడు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్ ప్రయోగ పరీక్షలు, థియరీ పరీక్షల కేంద్రాలను నిలిపివేశారు. దీంతో కొత్తచోట గుర్తింపు వచ్చిన తరువాతే సంబంధిత కళాశాలలకు కేంద్రాలు కేటాయిస్తామని ఇంటర్ బోర్డు అధికారులకు స్పష్టం చేసినా తాజాగా షరామామూలుగానే కళాశాలలు వ్యవహరిస్తున్నాయి.

### ఇంటర్ బోర్డు నిబంధనలు ఇలా....

ఒక కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే అనేక నిబంధనలు ఉన్నాయి. ముందుగా ప్రభుత్వం కళాశాలకు మంజూరు చేసిన గుర్తింపు ఉత్తర్వులు చూపాలి. దీనితోపాటు అనుబంధ గుర్తింపు పత్రం అందజేయాలి. కళాశాలకు కట్టిన కార్పస్‌ఫండు కాపీని ఇవ్వాలి. అంతేకాకుండా కళాశాలను తరలించేందుకు కారణాలు సూచిస్తూ కళాశాల గవర్నింగ్‌బాడీ తీర్మానం ఉండాలి. తరలించేందుకు ఒక్కో కళాశాల పట్టణ ప్రాంతాల్లో అయితే రూ. 27వేలు, గ్రామీణ ప్రాంతంలో అయితే రూ.12వేలు ప్రభుత్వానికి చెల్లించాలి. భూమి భవనాలు, ఆటస్థలం, ప్రయోగశాల, అగ్నిమాపక ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. అదేవిధంగా మెడికల్ అధికారి జారీచేసిన శానిటరీ ధ్రువీకరణ పత్రం, మున్సిపల్, కార్పొరేషన్,గ్రామీణ ప్రాంతాల నుంచి ఎన్‌వోసీ మంజూరు చేయాలి ఇలా అనేక నిబంధనలు కళాశాల మార్పు సమయంలో పాటించాలని ఇంటర్ బోర్డు నిబంధనలు చెబుతున్నాయి. ఇవేవి పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా కళాశాలల్ని నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంటర్ బోర్డు అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తేనే విషయం బహిర్గతమౌతుందని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి.




ఇంటర్‌బోర్డు కార్యాలయం

# పనులెప్పుడు ప్రారంభం?

- మెడికల్ కళాశాల నిర్మాణ పనుల ప్రారంభంపై లేని స్పష్టత
- అన్నీ సర్దేసుకుని వెళ్లిపోయిన కాంట్రాక్టు సంస్థ
- నిధుల అవకతవకలపై పలు ఆరోపణలు
- తాజాగా ఎస్టిమేషన్లు పంపించిన అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

2020లో ఉత్తర్వులు....2021లో శంకుస్థాపన...2023లో అరకొరగా పనులు ప్రారంభం....ఇదీ బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం అవలంభించిన తంతు.. అది కూడా సరిగ్గా ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందు మాత్రమే పనులు ప్రారంభించారు. నిర్మాణ పనుల తంతు ఇలా ఉంటే నాబార్డు నుంచి మంజూరయిన నిధులను యథేచ్ఛగా పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. వీటికి నిరూపణగా కాంట్రాక్టు సంస్థకు పెద్ద ఎత్తున బిల్లులను గద్దె దిగేనాటికి పెండింగ్‌లోఉంచారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పిల్లర్ల వరకు పూర్తయిన నిర్మాణాన్ని నిలిపి మెడికల్ కళాశాల మంజూరు దగ్గర నుంచి నిర్మాణం వరకు జరిగిన ప్రక్రియతో పాటు నిధుల వ్యయంపై కూడా నివేదిక తెప్పించుకుంది. ఈ క్రమంలో ఎన్నికల ముందువరకు అక్కడ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ఒక్కొక్కటిగా తన సామగ్రిని అక్కడ నుంచి తరలించేసింది. దీంతో మెడికల్ కళాశాల నిర్మాణంపై బాపట్ల ప్రజల్లో అనేక అనుమాన మేఘాలు కమ్ముకున్నాయి. ఇదే అదనుగా కళాశాల నిర్మాణాన్ని కూటమి పాలకులు అటకెక్కించారనే తప్పుడు ప్రచారాన్ని సైతం వైసీపీ మొదలుపెట్టింది. కానీ కాంట్రాక్టు సంస్థకు పెద్ద ఎత్తున బిల్లులు పెండింగ్ ఉండడం వల్లే వారు పనులు నిలిపివేశారనేది సమాచారం. మరోవైపు వీటి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్ షిప్ ప్రాతిపదికన నూతన విధానాన్ని తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. కాకపోతే మెడికల్ కళాశాల పనులు నిలిపివేసి ఇప్పటికే ఆరు నెలలు దాటుతుండడంతో నిర్ణయం త్వరితగతిన తీసుకుని నిర్మాణ పనులు ప్రారంభించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది

### వైసీపీ నిర్వాకాలే శాపాలుగా...

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు ప్రస్తుతం జాప్యం వెనకాల గత ప్రభుత్వ నిర్వాకాలే శాపాలై వెంటాడుతు న్నాయి. ముఖ్యంగా నాబార్డు తొలి విడత కింద మంజూరు చేసిన రూ.298 కోట్ల నిధుల విషయంలో పారదర్శకతకు పాతరేస్తూ వైసీపీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరించింది. యథేచ్ఛగా ఈ నిధులను దారి మళ్లించినట్లు ఇప్పటికే ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చింది. ప్రస్తుతం పూర్తయిన పిల్లర్ల దశ నిర్మాణం వరకు కాంట్రాక్టు సంస్థ రూ.112 కోట్లు వరకు ఖర్చుపెట్టినట్లు సమాచారం. వీటిలో దాదాపు రూ.58 కోట్ల వరకు బిల్లులను కూటమి ప్రభుత్వం కొలువుదీరాకే చెల్లించినట్లు తెలుస్తోంది. అర్ధంతరంగా పనులు ఆపి అన్నీసర్దేసుకుని కాంట్రాక్టు సంస్థ వెళ్లిపోవడం వెనక గత ప్రభుత్వం పెండింగ్ ఉంచిన బిల్లులు కూడా ప్రధాన కారణంగా ఉన్నాయి. నిధుల తంతు ఇలా ఉంటే కళాశాల నిర్మాణానికి కేటాయించిన భూమి విషయంలో కూడా పెద్ద ఎత్తున క్విడ్ ప్రోకో జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. మెడికల్ కళాశాల నిర్మాణం కోసం కావాల్సిన భూమిని ఓ దాత విరాళమిచ్చినట్లు అప్పట్లో వైసీపీ తెగ హడావిడి చేసింది. ఆ భూమంతా అసైన్డ్ కావడంతో దానిని ప్రభుత్వ అవసరాలకు వేరొకరు దానమివ్వడం ఏంటనే కోణంలో కూడా ప్రస్తుత పాలకులు వివరాలు తెప్పించుకున్నారు.

### నూతన విధానంపై కసరత్తు...

పనులు నిలిచిపోయి ఇప్పటికే ఆరు నెలలు అయింది. కానీ ఇంకా కూటమి ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో పనులు మొదలుపెట్టడానికి కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి తాజా ఎస్టిమేషన్లను కూడా ఇప్పటికే ప్రభుత్వానికి అధికారులు పంపినట్లు సమాచారం. ఇటీవల బాపట్లలో జరిగిన డీఆర్సీ సమావేశం అనంతరం మాట్లాడిన ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి త్వరలోనే మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పడం గమనార్హం. వెంటనే పనులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే పనులు పూర్తయ్యేసరికి కనీసం రెండేళ్లు పట్టే అవకాశం కనబడుతోంది. ఇది కూడా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడితేనే రెండేళ్లు, లేదంటే మరో ఆరు నెలలు సమయం పట్టొచ్చు.



పిల్లర్ల దశలో నిలిచిపోయిన కళాశాల నిర్మాణ పనులు



## పాఠశాలల ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధనకు కృషి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు పాఠశాలలకు ఫైవ్ స్టార్ రేటింగ్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని డీఈవో సీవీ రేణుక తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఫైవ్ స్టార్‌లో ఒక్కటి లేదు' కథనానికి డీఈవో స్పందించారు. పాఠశాలల్లో రేటింగ్ పెంచేందుకు తరచుగా ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు విస్తృతంగా తనిఖీలు చేసి పాఠశాలల్లో ఉన్న లోపాలను గుర్తించి సరిదిద్దే పనులు చేపట్టామని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం పెంచి ఎస్ఎస్‌సీ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో ఫలితాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాం. అలానే తరగతి గదుల్లో మంచి వాతావరణం, పాఠశాలలకు ప్రహరీ గోడల ఏర్పాటు, ఇంటర్నెట్ సదుపాయం, ఫర్నిచర్, లైబ్రరీ రూంల ఏర్పాటుపై దృష్టి పెట్టామన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం నిందితులు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ ప్రభాకరరావు, ఎస్ఐ కృష్ణారావు

నరసరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి వైరు చోరీ చేసే ముఠా పోలీసులకు చిక్కింది. నలుగురు నిందితులను అరెస్టు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌లలో చోరీ చేసిన రూ. 3.50 లక్షల విలువైన రాగి వైరును స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రూ.2 వేలు విలువైన రాగి వైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు వరకు ఉంటుంది. దాదాపు 145 ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేశారు. వీటి విలువ దాదాపు రూ 2.50 కోట్లు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో పోలీసు శాఖ సదరు దొంగలపై ప్రత్యేక దృష్టి సారించింది. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, ఐనవోలు ఎస్ఐ కృష్ణారావు బృందం పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో నమోదైన కేసులను ఛేదించారు. పల్నాడు జిల్లాలో 19, ప్రకాశం జిల్లాలో 8, మొత్తం 27 కేసులు ఉన్నాయి. ఈ కేసులకు సంబంధించి ప్రకాశం జిల్లా అనసపాలెంకు చెందిన నల్లబోతుల పెద్ద యంగయ్య, నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామానికి చెందిన బత్తుల కోటయ్య, వినుకొండ మండలం గాంధీనగర్‌కు చెందిన వీరబోయిన బాలయ్య, రొంపిచర్ల మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన తోలుసురి లక్ష్మీ నారాయణలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 350 కిలోల రాగి వైరును స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ. 3.50 లక్షలని డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు.

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య


కల్యాణి (ఫైల్)

మంగళగిరి సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ఓ మహిళా కానిస్టేబుల్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... 2018 బ్యాచ్‌కు చెందిన కల్యాణి (34) గత నాలుగు సంవత్సరాలుగా తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుంది. మంగళగిరి పట్టణంలోని మార్కండేయ కాలనీలో భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మంగళగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కల్యాణి మృతికి గల కారణాలు తెలియాల్సి వుంది.

# నా భూమిని ఆక్రమించి ప్లాట్లు వేశారు

- అడ్డుకున్నందుకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు
- వైసీపీ హయాంలో రియల్టర్ల తీరుపై ప్రజాదర్బారులో ఫిర్యాదు


రియల్‌దందాపై చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న దాదా సాహెబ్

వినుకొండటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బారు కార్యక్రమంలో గత ప్రభుత్వ హయాంలో కొందరు రియల్టర్లు భూకబ్జాలకు పాల్పడ్డారంటూ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. బాధితుడి షేక్ దాదా సాహెబ్ కథనం మేరకు పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గుడ్‌షఫర్డ్ పాఠశాల సమీపంలో 2021లో 40 సెంట్లు భూములు కొనుగోలు చేశానని, గత ప్రభుత్వ హయాంలో కొందరు రియల్టర్‌లు తాను కొనుగోలు చేసిన భూమిని అమ్మలేదని తమ కుటుంబంపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని వాపోయారు. వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న కొందరు బడా నాయకులకు అప్పటి రెవెన్యూ అధికారులు, సర్వేర్లు తొత్తులుగా వ్యవహరించి రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. తాము కొనుగోలు చేసిన భూమిని ఆక్రమించుకొని ప్లాట్లు ఏర్పాటుచేశారని, ఇదేమని అడిగితే దౌర్జన్యాలు, దాడులు, తప్పుడు కేసులు పెట్టి తమ కుటుంబాన్ని వేధించారంటూ వాపోయారు. జరిగిన సంఘటనపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఆక్రమదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సీఐ శోభన్‌బాబుకు సూచించారు.

### ఆక్రమించి భూమిని చదును చేసి..

వెల్లటూరు రోడ్డులోని సర్వే నంబరు 251లోని 4 ఎకరాల భూమిలో గల ఎన్ఎస్‌పీ కాల్వను గత ప్రభుత్వం అండతో ప్రభుత్వ సానుభూతి పరులు అక్రమంగా ఎన్ఎస్‌పీ కాల్వ భూమిని ఆక్రమించుకొని భూమిని చదునుచేసి నిర్మాణాలు చేపట్టారు. దీంతో పెరుమాలళపల్లి మేజర్ కాల్వ నుంచి సింగరు చెరువు వరకు ఉన్న మైనర్ కాలువ కనుమరుగైంది. సర్వే నంబరు 246/4, 246/5, 251లోని ఎన్ఎస్‌పీ కాలువ భూమి సుమారు 80 సెంట్లు మేర ఆక్రమణకు గురికావడంతో స్థానికులు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. త్వరలో జిల్లా సర్వేయర్ చేత సర్వే చేయించి ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఫిర్యాదుదారులకు భరోసా ఇచ్చారు.

# మందేసి...చిందేసి...!

- బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మందు తాగుతూ...చిందేస్తూ
- బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ పుట్టినరోజు వేడుకల్లో హల్‌చల్
- వీడియోలు నెట్టింట వైరల్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)


మందు బాటిల్‌తో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన

ప్రభుత్వ కార్యక్రమాల్లో మనం ప్రొటోకాల్ చూసుంటాం... ఎందుకంటే రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారికి దక్కే గౌరవం అది. కానీ ఏకంగా ఓ నేత పుట్టిన రోజు వేడుకల్లో షాంపైన్ పొంగించడానికి ఎమ్మెల్యేకు ప్రొటోకాల్ గుర్తుచేసి దానిని ఓపెన్ చేసే మహద్భాగ్యం సదరు నేతకు కల్పించడం, మందేసి చిందేయడం వీటన్నింటికీ బాపట్లలోని పాండురంగాపురం బీచ్ వేదికగా నిలిచింది. ఈ నెల 11న బాపట్లకు చెందిన బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పుట్టిన రోజు కావడంతో, పదో తేదీ అర్ధరాత్రి నుంచే పాండురంగాపురం బీచ్ వేదికగా వేడుకలకు తెర తీశారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత అనంత వర్మతోపాటు పలువురు నేతలు, అనుచరులు ఈ వేడుకల్లో భాగస్వాములైయ్యారు. వేడుకల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మందు గ్లాసు చేతిలో పట్టుకుని చిందేసిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో పాటు వారి మధ్య జరిగిన సంభాషణలు కూడా ప్రజల్లో చర్చకు దారి తీశాయి. వేడుకల్లో భాగంగా షాంపైన్ బాటిల్ ఓపెన్ చేసే క్రమంలో అన్నీ ఆయనే ఓపెన్ చేయాలా అని ఒకరంటే ప్రొటోకాల్ అని వైసీపీ నేత అనంతవర్మ అనడం, సదరు బాటిల్‌ను ఎమ్మెల్యే నరేంద్రవర్మే ఓపెన్ చేయడం ఇవన్నీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పుట్టిన రోజు వేడుకలు జరిగి వారం గడిచాక అక్కడ అంతర్గతంగా జరిగిన వీడియోలు బయటకు రావడం వెనక అక్కడ వేడుకల్లో పాల్గొన్న వారే కావాలనే వీటిని బయటకు విడుదల చేశారనే అనుమానాన్ని నేతలు వ్యక్తం చేస్తున్నారు

### సాధారణమే కానీ....

ప్రైవేటు కార్యక్రమంగా జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో మందేయడం, చిందేయడం, మ్యూజికల్ నైట్ ఇవన్నీ కూడా సర్వ సాధారణమే. కానీ ఆ వేడుకల్లో పాల్గొన్నది ప్రస్తుతం టీడీపీ తరఫున బాపట్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కావడంతో ఆ మందు, చిందులపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

# అక్రమ రుణాలపై దర్యాప్తు వేగవంతం

- రంగంలోకి దిగిన సీఐడీ అధికారులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు రూ.130 కోట్లు స్వాహా
- నేడు అనంతవరం, పచ్చల తాడిపర్రు, పొన్నూరు బ్రాంచ్‌లలో దర్యాప్తు

గుంటూరు, డిసెంబర్ 16( ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన లక్ష్యంగా మహిళల స్వావలంబన కోసం ఏర్పాటు చేసిన సంస్థ మెప్మా. అయితే అందులో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు అక్రమాలకు బరితెగించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పొన్నూరు, పచ్చలతాడిపర్రు, అనంతవరం, గుంటూరు నగరంలోని కొరిటెపాడు, సంగడిగుంట, పాత గుంటూరు, కేవీపీ కాలనీతో పాటు అనేక మురికివాడలలో బోగస్ డ్వాక్రా గ్రూపులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి, వారందరికీ గుంటూరులోని అనేక బ్యాంకుల్లో వారి గ్రూపుల పేరు మీద బ్యాంకు ఖాతాలను ప్రారంభించారు. వారి పేరు మీద పొదుపు చేస్తున్నట్లుగా మెప్మాలో పనిచేస్తున్న సీవోలు, బ్యాంక్ అధికారులతో కుమ్మక్కయి పెద్ద ఎత్తున గేమ్ ఆడారు. అంతా సిండికేట్‌గా మారి ఆ గ్రూపుల పేరిట ఉమ్మడి గుంటూరు జిల్లాలో 130 కోట్ల రూపాయల రుణాలు పొందారు. వాస్తవానికి గ్రూపులో సభ్యులు మాత్రం ఉంటారు. వారంతా కూడా ఇతర బ్యాంకుల్లో, ఇతర గ్రూపుల్లో సభ్యులుగా ఉంటారు. అయితే ఒక్కొక్క గ్రూపుకి ఒక్కొక్క సభ్యురాలిని ఎంపిక చేసి, వారి పేరు మీద మరో 9 మందిని కొత్త గ్రూపులు పెట్టి. ఆ విధంగా బోగస్ గ్రూపులను చిత్రీకరించి వారి పేరు మీద పెద్ద ఎత్తున రుణాలను పొందారు. పొందిన రుణాలను బ్యాంకు మేనేజర్లు, మెప్మా సీవోలు, ఆర్పీలు పంచుకున్నారు.

### నోటీసులు రావడంతో వెలుగులోకి

గుంటూరు నగరంలోని సంగడిగుంట ప్రాంతంలో ఓ బ్యాంకు, రుణాలు చెల్లించాలని డ్వాక్రా గ్రూపులకు నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న డ్వాక్రా మహిళలు కంగుతిన్నారు. మా గ్రూపు అది కాదనీ, మా గ్రూపులో ఉన్న సభ్యులెవరూ రుణాలు తీసుకోలేదని. బ్యాంకు అధికారులు ఇచ్చిన నోటీసుకు సమాధానం పంపారు. నోటీసులకు మహిళలు సమాధానం ఇవ్వటం, బ్యాంకు ఉన్నతాధికారుల పరిశీలనకు వెళ్లడంతో అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పొన్నూరు నియోజకవర్గం, గుంటూరు ఈస్ట్, వెస్ట్‌తో పాటు జిల్లాలో అనేక ప్రాంతాల్లో బోగస్ గ్రూపులు పెట్టి, అక్రమంగా రుణాలు పొందినట్లు వెలుగులోకి వచ్చింది. దీనిపై నెల క్రితం మెప్మా అధికారులు ఇద్దరు సీవోలను సస్పెన్షన్ చేసి చేతులు దులుపుకున్నారు.

### దర్యాప్తులో విస్తుబోయే అక్రమాలు

డ్వాక్రా గ్రూపుల రుణాలలో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసేందుకు గుంటూరు సీఐడీ అధికారులు రంగంలోకి దిగారు. దీంతో ప్రాథమికంగా చేపట్టిన దర్యాప్తులో విస్తుబోయే అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ బోగస్ రుణాలు వెనుక బ్యాంకు ఉన్నతాధికారులు కూడా ఉన్నట్లు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన బోగస్ గ్రూపుల రుణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మొత్తం వ్యవహారాన్ని లెక్క తేల్చేందుకు దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం పొన్నూరు టౌను, పచ్చలతాడిపర్రు, అనంతవరం ఆయా ప్రాంతాల్లో ఉన్న యూనియన్ బ్యాంక్ బ్రాంచీలలో సీఐడీ అధికారులు దర్యాప్తు నిర్వహించనున్నారు

## సీఎం సహాయనిధికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తాడేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని నివాస గృహంలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి ఏపీ టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెంట్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.4,01,116లు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. మంత్రి లోకేశ్ వీరిని అభినందించారు.

## నీటికుంటలో గల్లంతైన విద్యార్థి మృతి

మేడికొండూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నీటికుంటలో గల్లంతైన బీఫార్మసీ విద్యార్థి మూల్పూరి రంజిత్ (21) మృతి చెందాడు. మేడికొండూరు మండలం, భీమినేనివారిపాలెంలోని ఓ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మూల్పూరి రంజిత్ కళాశాల సమీపంలోని నీటికుంటలో ఆదివారం ఈతకు దిగి గల్లంతైన విషయం విదితమే. సోమవారం నీటి కుంటలో గాలించిన పోలీసులకు రంజిత్ మృతదేహం లభించింది. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కళాశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగానే విద్యార్థి రంజిత్ మృతి చెందాడని ఆగ్రహిస్తూ పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు విద్యార్థి కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. కళాశాల ఆవరణలో మృతదేహాన్ని ఉంచి ధర్నా నిర్వహించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం తరువాత మృతదేహం తరలించడానికి ఎమ్మార్పీఎస్ నాయకులు అంగీకరించారు.

# చిన్నారులపై.. చలి పంజా

(5వ పేజీ తరువాయి)

ఇన్‌ఫ్లుయెంజా ఏ, బీ అనే రెండు రకాలు ఉంటాయి. ఏ రకం ఊపిరితిత్తులపై ప్రభావం చూపడంతో పాటు అలసట, జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలను కలిగిస్తుంది. చలి కాలంలో ఇది విజృంభిస్తుంది. రోగుల దగ్గులు, తుమ్ముల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులువుగా వ్యాపిస్తాయి. "నగరంలో ఫ్లూ బాధిత చిన్నారుల్లో మధ్య తరహా వ్యాధి లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయి. బాధితులు ఆసుపత్రుల్లో చేరి చికిత్సలు పొందాల్సినంత తీవ్రస్థాయిలో వ్యాధి లక్షణాలు లేవని" గుంటూరు జీజీహెచ్ పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రికి వస్తున్న కేసుల్లో వ్యాధి లక్షణాలు తీవ్రంగా ఉన్న వారిని మాత్రం అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందిస్తున్నట్లు ఆయన వివరించార

### జాగ్రత్తలు ఇవీ...

- పెద్దలు ఏడాదిలోపు చిన్నారులను పట్టుకునే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. మాస్క్ ధరించాలి. తల్లిపాలే శిశువులకు అందించాలి
- ఏడేళ్లలోపు పిల్లలను సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఏడు గంటల వరకు బయటకు తీసుకెళ్లకూడదు.
- రాత్రి సమయాల్లో ఏసీల వినియోగం పూర్తిగా మానేయాలి. చిన్నారులు నిద్రించే గదుల్లో ఫ్యాన్ల వేగం తగ్గించాలి
- చలి కాలంలో ఐస్‌క్రీములు, కూల్‌డ్రింకులు వంటి చల్లని పదార్థాలను పిల్లలకు ఇవ్వకూడదు. గోరువెచ్చని నీళ్లు తాగించాలి
- ఐదేళ్లు వచ్చే వరకు ప్రతి ఏడాది ఫ్లూ వ్యాక్సిన్ ఇప్పించడం మంచిది. ఆస్తమా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇన్‌హేలర్లు వినియోగించాలి.
- చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచేలా పోషకాహారం అందించాలి.

తక్కువ వ్యాధి నిరోధక శక్తి ఉండటం వల్లే చలికాలంలో ఎక్కువగా వ్యాధుల బారిన పడతారు.

- మూడు రోజులకు మించి జలుబు, దగ్గు ఉంటే వైద్యుడిని సంప్రదించి చికిత్సలు చేయించాలి.

## బేస్‌బాల్ విజేతలుగా గుంటూరు జట్లు


విజేత బాలిక జట్టుకు కప్పు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధూళ్ళిపాళ్ళ సమీపంలో గల లయోల ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి అండర్ - 19 స్కూల్ గేమ్స్ బేస్ బాల్ పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. కాగా సోమవారం పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని విజేతలు ట్రోఫీలను అందజేశారు. ముందుగా ఆయన మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని అన్నారు. క్రీడల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో సానుకూలంగా పని చేస్తున్నారన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను రెండు నుంచి మూడు శాతానికి పెంచటం క్రీడాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. తాను కూడా ఒకప్పుడు క్రీడాకారుడినేనని, క్రీడాకారులు పడే ఇబ్బందులు తనకు తెలుసునన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానం గుంటూరు జిల్లా జట్టు, రెండో స్థానం పశ్చిమ గోదావరి జిల్లా జట్టు, మూడో స్థానం విజయనగరం జిల్లా జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి స్థానం గుంటూరు జిల్లా, రెండవ స్థానం శ్రీకాకుళం జిల్లా, మూడవ స్థానం విజయనగరం జిల్లా జట్లు నిలిచాయి. విజేత జట్లకు ఎమ్మెల్యే కన్నా ట్రోఫీ, ప్రశంసా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి జీ నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, టోర్నమెంట్ పరిశీలకులు పీ నాగేంద్రం, యూ నీలిమ, కళాశాల డైరెక్టర్ వంశీ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు, పీఈటీలు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధిత రైతుల బాండ్ల తనిఖీ

దుగ్గిరాల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గతేడాది జనవరి 19న స్థానిక శుభం కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు సంబంధించిన బాండ్‌లను బీమా సంస్థ బృందం సోమవారం తనిఖీ చేసింది. నష్టపోయిన రైతులకు కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యం పరిహారం అందించకపోవడంతో పలువురు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. కోట్లాది రూపాయలను నష్టపోయినప్పటికీ సరైన స్పందన లభించక పోవడంతో అప్పటి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అర్హులైన రైతులను గుర్తించి వారందరికీ న్యాయం చేసేందుకుగానూ, అధికారులు, రైతులు, రైతుసంఘాల నాయకులతో ఓ కమిటీ ఏర్పాటు చేశారు. వచ్చే జనవరి 19నాటికి ఏడాది కావస్తుండగా నేటికీ పంటబీమాకు సంబంధించి ఎలాంటి ప్రకటన రాలేదని రైతులు ఆందోళన చెందుతూ వచ్చారు. 400 మందికిపైగా రైతులకు సంబంధించిన పసుపు నిల్వలపై కోట్లాది రూపాయల పరిహారం అందించే క్రమంలో భాగంగా ఇండియా ఇన్సూరెన్స్ సంస్థకు సంబంధించి రైతుల వద్దనున్న బాండ్లను పరిశీలించేందుకు వచ్చినట్లు ప్రతినిధి జుబేర్ అలీఖాన్ సోమవారం తెలిపారు. కచ్చితమైన బాండ్లను కలిగి అర్హులైన రైతులను గుర్తించి నివేదికను ప్రభుత్వానికి, బీమా సంస్థకు అందజేస్తామని చెప్పారు.

## అట్టహాసంగా ఎడ్లబండలాగుడు పోటీలు


ప్రథమస్థానం సాధించిన నంద్యాల ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. మొదటి రోజైన సోమవారం సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించగా నంద్యాల మండలం పెదకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎడ్లజత పందెపు బండను నిర్ణీత సమయంలో 3439.6 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పెదపులిపాకకు చెందిన గరికపాటి శ్రీధర్ ఎడ్లజత 3200 అడుగులతో రెండోస్థానం, తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా, పెనమలూరు మండలం, యాదిరెడ్డిపల్లెకు చెందిన డాక్టర్ అకిలేష్‌రెడ్డి ఎడ్లజత 3090.3 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 3045.2 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన పులగం జశ్వితారెడ్డి ఎడ్లజత 2800 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి సాధించిన ఎడ్లజతకు విక్టర్ బయో జెనిటిక్స్ ఎండి తోట శ్రీనివాసరావు రూ. లక్ష బహుమతిని అందించారు. కాగా మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. పట్టణానికి చెందిన దివ్యాంగుడు గాలయ్యకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎలక్ట్రికల్ ట్రైసైకిల్‌ను అందించారు.

## నీటి కుంటలో పడి ఇద్దరు మృతి


ఆసుపత్రిలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో పడి ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలోని పులిపాడు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పులిపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, మాధవి దంపతుల కుమారుడు సుభాష్ (11) దాచేపల్లి పట్టణంలోని ఓ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం బడికి వెళ్లేందుకు స్కూల్ బస్సు ఎక్కాడు. గ్రామం నుంచి కొంత దూరం వెళ్లాక బస్సు డ్రైవర్ కోటేశ్వరరావు రేడియేటర్‌లో నీళ్ల అయిపోవడంతో రోడ్డు పక్కన బస్సు నిలిపాడు. రోడ్డు పక్కన ఉన్న నర్సరీ వద్ద గల నీటికుంటలో నీరు తేవాలని దాచేపల్లి మండలం ఇరికేపల్లికి చెందిన బస్సు క్లీనర్ కోటేశ్వరరావు (55)కు చెప్పారు. అయితే నీటి కోసం బాలుడు సుభాష్, క్లీనర్ కోటేశ్వరరావు వెళ్లారు. అయితే సుభాష్ నీటికుంటలో దిగి మునిగిపోయాడు. సుభాష్‌ను కాపాడే క్రమంలో నీటికుంటలోకి దిగిన క్లీనర్ కోటేశ్వరరావు కూడా కుంటలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కర్, ఎస్ఐ వినోద్ సంఘటనా ప్రదేశానికి వెళ్లి మృతదేహాలను వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు అర్థాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

### పరామర్శించిన ఎమ్మెల్యే యరపతినేని

ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సందర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 107.115.126 |
| చికెన్ విత్ స్కిన్ | 204.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 214.00 |

## 51,264 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 57,488 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,264 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 42,799 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 7500 | 14000 |
| నెంబరు. 5 | 8000 | 13000 |
| 273 | 8000 | 11500 |
| 341 | 8000 | 15500 |
| 4884 | -- | -- |
| సూపర్ 10 | 11500 | 13000 |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 8000 | 16500 |
| బ్యాడిగి | 8000 | 12500 |
| దేవనూరు డీలక్స్ | 8000 | 15500 |
| తెల్లకాయలు | 4000 | 11000 |

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| **ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 8500 | 15500 |
| నెంబరు.5 | -- | -- |
| 273 | 10000 | 11000 |
| 341 | 8000 | 14500 |
| 4884 | -- | -- |
| సూపర్ 10 | -- | -- |
| **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 8000 | 16000 |
| బ్యాడిగి | 7500 | 12500 |
| దేవనూరు డీలక్స్ | 10500 | 14000 |
| తెల్లకాయలు | 4500 | 10000 |

## వచన కవితా పితామహుడు కుందుర్తి

● సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పద్య రచనకు స్వస్తి పలికి వచన కవితకు శ్రీకారం చుట్టిన కుందుర్తి ఆంజనేయులు వచన కవితా పితామహుడు అని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. సోమవారం కుందుర్తి ఆంజనేయులు 102వ జయంతి కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు సంయుక్తంగా మాట్లాడుతూ పాతకాలం పద్యమైతే వర్తమానం వచన గేయం అని కుందుర్తి ప్రకటించారని, వచన కవిత ప్రచారానికి జీవితాంతం కృషి చేశారని అన్నారు. అనంతరం రచయితలు బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, పువ్వాడ వెంకటేశ్వర్లు తదితరులు కుందుర్తి ఆంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో వెంకట రామారావుకు బంగారు పతకాలు



లేళ్ళ వెంకటరామారావు

బాపట్ల, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో బాపట్ల పట్టణంలోని భీవరా వారి పాలేనికి చెందిన లేళ్ళ వెంకటరామారావు మూడు బంగారు పతకాలు సాధించారు. ఈనెల 14, 15 తేదీలలో గుడివాడలో జరిగిన పోటీలలో షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రోలో 85 సంవత్సరాల విభాగంలో పాల్గొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 5, 6, 7 తేదీలలో రాజస్థాన్‌లో జరగబోయే జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఆయన ఎంపికయ్యారు. ఇప్పటి వరకు 92మెడల్స్ సాధించిన వెంకటరామారావు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావటంపై పలువురు అభినందించారు.

## నేడు పట్టణ, మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఇసుకపల్లిలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు రేపల్లె పట్టణం, మండలంలోని అన్ని గ్రామాలు, నగరం, నిజాంపట్నం మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.సురేష్‌బాబు తెలిపారు. విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కామినేనివారిపాలెంలో అగ్నిప్రమాదం

చెరుకుపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరుంబాక పంచాయతీ కామినేనివారిపాలెంలో సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన రైతు కామినేని శ్రీనివాసరావుకు చెందిన 1.5 ఎకరాల గడ్డివామి దగ్ధమైంది. ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు ఎగసిపడటం వలన ఈప్రమాదం జరిగినట్లు చెప్పారు. ఈఘటనలో సుమారు పదిహేను వేల రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తుంది.

## అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బాపట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 6వ వార్డు ఉప్పరపాలెంలో సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాన్ని సోమవారం ఆఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం, దుస్తులు అందజేశారు. అదేవిధంగా విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు మరో రూ.4 వేల సాయం అందజేశారు. ఈనెల 7వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా టీచర్స్ అండ్ పేరెంట్స్ సమావేశానికి తన కుమార్తెతో కలిసి వెళ్ళామని ఆ సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల గృహం పూర్తిగా దగ్ధమైందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనలో తన కుమారుడి 10వ తరగతి సర్టిఫికెట్‌లు మొత్తం దగ్ధమయ్యాయని వివరించారు. సర్వస్వం పోయిన కుటుంబానికి తాము అండగా ఉంటామని సురేష్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు జీవీఎల్ మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వంగపాటి శివ, ఫౌండేషన్ సభ్యులు చేజర్ల సతీష్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ కుటుంబానికి నిత్యావసరాలు, రగ్గులు అందజేత

కర్లపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీ ఛత్రపతి శివాజి మహరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు, రగ్గులు అందజేస్తున్నామని శ్రీ ఛత్రపతి శివాజి మహారాజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు పెనుమెత్స శివాజి రాజు అన్నారు. కర్లపాలెంలోని లంక కాల్వ కట్టమీద ఉన్న ఎస్టీ కుటుంబానికి బియ్యం, రగ్గులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుమెత్స దిలీప్, శివరామరాజు, కె.వీరాంజనేయులు, బోయపాటి భాస్కర్, మంతెన కృష్ణంరాజు, పమిడి శ్రీనుబాబు, కోసూరి వెంకటేశ్వర్లు, బాలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని వైద్యులు జి.విష్ణుప్రసాద్ అన్నారు. భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విశ్వశాంతి విద్యా సంస్థలో ఆరోగ్య భారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు విద్యార్థులకు ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన కల్పించారు. ఒక వ్యక్తి మృతి చెందిన పది నిమిషాల లోపు సీపీఆర్ చేసి మెదడుకు రక్తప్రసరణ చేరేలా చేస్తే జీవించే అవకాశం లేకపోలేదన్నారు. ఇలాంటివి శాస్త్రీయంగా రుజువైనట్లు చెప్పారు. సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు వంగర శేషగిరిరావు, మాచర్ల వెంకటేశ్వర్లు, విశ్వశాంతి విద్యా సంస్థ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలపై తక్షణమే స్పందించాలి

● జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

● ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 98 అర్జీలు



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై వస్తున్న అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన వారి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 98 మంది అర్జీల ద్వారా వారి సమస్యలను జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. జాయింట్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కాల వేదికకు సంబంధించి రెవెన్యూ, రీసర్వే దరఖాస్తుల గురించి ఆరా తీశారు. వచ్చిన ఫిర్యాదులకు సరైన కారణాలు చూపకుండా అసంపూర్తిగా తిరస్కరించటం సరికాదన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను కేటగిరి వారీగా విభజించి నివేదించాలని చెప్పారు. సదస్సులలో వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించిన తీరుపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ట్రైసైకిళ్ళు ఇవ్వాలంటూ వినతి

దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు, సంకకర్రలు, చెవిటి మిషన్‌లు, వీల్‌ఛైర్‌లు ఇప్పించాలని కోరుతూ దివ్యాంగుల నాయకుడు చల్లా రామయ్య వినతిపత్రం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కోరారు. జిల్లాలో దివ్యాంగులు అనేక మంది పరికరాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దివ్యాంగులు ఈపూరి బోడెమ్మ, ఆరాధ్యుల వెంకటేశ్వరమ్మ, డి.కృష్ణారెడ్డిల సమస్యలు పరిశీలించిన జాయింట్ కలెక్టర్ వెంటనే వారికి ట్రైసైకిళ్ళు ఇవ్వాలని సంబంధిత దివ్యాంగుల శాఖాధికారులకు ఆదేశాలిచ్చారు.

### అవుట్ సోర్సింగ్ టీచర్స్‌ను కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్చాలి

గిరిజన సంక్షేమ గురుకులాలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్స్‌ను కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్పు చేయాలని, 2022 పీఆర్‌సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్, సీఐటీయు నాయకులు కె.శరత్, ఎం.పరమేష్, రామకృష్ణ, రవికిరణ్, సుజాత, శాంతిప్రియ, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నభూమిని స్వాధీనం చేసుకున్నారు.. ఉపాధిలేక ఇబ్బంది పడుతున్నారు

వైసీపీ పాలకులు మెడికల్ కళాశాల నిర్మాణం పేరిట తమ కుటుంబ సభ్యులకు ఉన్న 9 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారని, నాటి నుంచి నేటి వరకు ఏవిధమైన పరిహారం అందించకపోవటంతో ఉపాధి కోల్పోయి ఇబ్బంది పడుతున్నామని మానం ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆయన సోమవారం వినతిపత్రం అందజేశారు. జమ్ములపాలెం రోడ్డులోని మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతంలో 9 ఎకరాల వ్యవసాయ భూమి తమ తాత మచ్చా నాగిరెడ్డి ద్వారా వంశపారపర్యంగా ఆదినారాయణకు సంక్రమించింది. అందులో 5 ఎకరాల 2 సెంట్లకు పట్టాదారు పాస్ పుస్తకం కూడా ఉంది. అయితే ఈభూమి మొత్తం అసైన్డ్‌భూమి అంటూ వైసీపీనాయకులు అప్పటి రెవెన్యూ అధికారుల ద్వారా స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ప్రశ్నించిన ఆయనకు పరిహారం ఇప్పిస్తామని ఆశ చూపి కాలం గడిపారు. నాటి నుంచి నేటి వరకు సాగు చేయటానికి భూమిలేక ఆదాయ వనరులు ఏమాత్రం లేక ఆర్థికంగా ఆ కుటుంబం చితికిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్డీవో ద్వారా విచారణ జరిపించనున్నట్లు జేసీ తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు

రేపల్లె, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఏడు అర్జీలు అందాయని ఆమె తెలిపారు. పాతపట్నంలోని రహదారి అభివృద్ధిలో భాగంగా గృహాలు తొలగించి సంవత్సరం కావస్తున్నా నేటికి నష్టపరిహారం అందించలేదని, తక్షణమే నష్టపరిహారం అందించాలని కోరారు. పట్టణానికి చెందిన ఒడుగు రాంబాబు నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామంలో తనకు గల సర్వేనెం.377/4లో య.0.91సెంట్లు భూమి ఉందని ఆన్‌లైన్‌లో య.0.71సెంట్లు మాత్రమే నమోదైందని మిగతా య.20సెంట్లు నమోదు చేయాలని కోరారు. మండలంలోని పెనుమూడి గ్రామానికి వెళ్ళే వంతెన బలహీనంగా ఉందని, తక్షణమే వంతెన మరమ్మతులు నిర్వహించాలని గ్రామస్తులు కోరారు. అమర్తలూరి మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన గొరికపూడి విద్యాప్రసాద్ పెన్షన్‌లు మంజూరు చేయాలని కోరారు. భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన ఎం.యామిని తమ భూమిని వేరొకరు ఆక్రమించుకుని ఉన్నారని, విచారించి తమ భూమిని తమకు ఇప్పించాలని కోరారు. యడ్లపాడు గ్రామానికి చెందిన లింగినేని కృష్ణమూర్తి తన భూమిని ఆన్‌లైన్ చేయాల్సిందిగా కోరారు. ఈ సమస్యలను ఆయా శాఖలకు అందించి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు.

## బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

● నామినేషన్లు పూర్తి.... నేడు ఉపసంహరణ

బాపట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎన్నికలలో ఆసక్తికర పోరు నెలకొంది. గతంలో కంటే ఈసారి గట్టిపోటీ నెలకొనే అవకాశం ఉంది. సోమవారం నామినేషన్‌ల ప్రక్రియ ముగిసింది. అధ్యక్షపదవీ కోసం ముగ్గురు నామినేషన్ దాఖలు చేశారు. వారిలో ముప్పలనేని శ్రీనివాసరావు, దొప్పలపూడి రామ్మోహనరావు, ముప్పలనేని శేషసుమంత్‌కుమార్‌లు ఉన్నారు. అదేవిధంగా ఉపాధ్యక్ష పదవి కోసం కొల్లా వీరయ్యచౌదరి, శిఖరం నాగేంద్రవరప్రసాద్, కారుమంచి వెంకట్రావు, ఉపాధ్యక్షుడు-2 కోసం చెన్నుపాటి వీరయ్య, కొల్లా వీరయ్యచౌదరి, పారేపల్లి చంద్రశేఖర్, సెక్రటరి పదవికి మానం నాగేశ్వరరావు, కారుమంచి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరి పదవికి కొమ్మినేని హరిపద్మ ప్రసాద్, మానం శ్రీనివాసరావు, దొడ్డపనేని వెంకయ్య చౌదరి, కోశాధికారి పదవికి తాళ్ళూరి రామకృష్ణారావు, కోట వీరబ్రహ్మయ్యలు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ జరుగుల సతీష్‌బాబు వ్యవహరించారు. మంగళవారం నామినేషన్‌ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. ఈనెల 22వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. పోటీ చేసిన వారిలో ఎక్కువమంది ప్రస్తుత పాలకవర్గంలో ఉన్నవారే. అయినప్పటికి గట్టిపోటీ ఇచ్చేందుకు కొత్త అభ్యర్థులను కూడా రంగంలోకి దించారు. దీంతో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎన్నికల ప్రక్రియ ఉత్కంఠంగా మారింది. రెండు ప్యానల్స్ వారు ఎవరికి వారు ఎత్తుగడలు వేస్తున్నారు.

## ఎమ్మెల్యే వేగేశనకు అభినందనలు



ఎమ్మెల్యే నరేంద్రవర్మకు అభినందనలు తెలుపుతున్న ఎండీ ఇస్మాయిల్, వినయ్‌కుమార్‌రెడ్డి

పిట్టలవానిపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు-2 (311) సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎండీ ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడిగా చిరసాని వినయ్‌కుమార్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నిక కావటంపై వారు బాపట్ల టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, టీడీపీ నాయకులు మోదుగుల శంకర్‌రెడ్డి, షేక్ మీరా, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం



పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థులు

బాపట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని జి.ఛాంప్‌అభాకస్ సంస్థతో కలిసి ఎలివేట్ ఏఐ సంస్థ వారు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్థానిక అన్నంసతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ పోటీలకు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను 4 కేటగిరిలుగా విభజించి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్ సభ్యులు గోపాళం రఘుపతిరావు ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు పంపిణీ చేశారు. ఎలివేట్ ఏఐ సంస్థ వ్యవస్థాపకుడు దండే యజ్ఞనారాయణ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించుకొని బధిరుల కొరకు సంజలను ఆడియోగా, ఆడియోను సంజలుగా మార్చి అందించే ప్రాజెక్ట్‌ను చేపట్టబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు బి.సంగమేశ్వర శాస్త్రి, ఇక్కుర్తి శ్రీనివాసరావు, ఎలివేట్ ఏఐ సంస్థ సీఈవో ప్రియాంక, ఉపాధ్యాయులు విజయబాబు, శేషాద్రి శ్రీనివాసరావు, రాజేంద్ర, జి.వెంకటేశ్వర్లు, దండే వెంకటరెడ్డయ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ : ఎంపీడీవో

పిట్టలవానిపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 14 గ్రామపంచాయతీలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు అధ్యక్షతన సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ సమావేశం హాలులో గ్రామపంచాయతీలలోని మండలస్థాయి అధికారులకు గ్రేడ్-1, 4 కార్యదర్శులకు, గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రేపల్లె డీఎల్‌డీవో పి.పద్మ ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. విద్య, వైద్యం, పారిశుధ్యం, పౌష్టికాహారం తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు మాట్లాడారు. షేక్ రబ్బానీ శిక్షకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పాలనాధికారి పి.మధుసూదనరెడ్డి, ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, చందోలు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ.అరుణకుమారి, చందోలు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల సూపర్‌వైజర్ ఎ.నాగేశ్వరరావు, గ్రామపంచాయతీల సర్పంచ్‌లు ఐనంపూడి శ్రీనివాసరావు, బొలగాని అరుణకుమారి, ఏట్రి అశ్విని, ఉప్పు చెంచు లక్ష్మి, యెనుముల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

### చెరుకుపల్లి మండలంలో...

చెరుకుపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని మాట్లాడుతూ గ్రామాలలో సుస్థిర అభివృద్ధి జరగాలి అంటే పేదరిక నిర్మూలన ఆహార భద్రత, మంచి ఆరోగ్యం, నాణ్యమైన విద్య, లింగసమానత్వం, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, అందరికి పనికల్పన, పరిశ్రమల కల్పన మొదలైనవి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ శిక్షణా కేంద్రం అధికారి జి.కేజియా, బాపట్ల ఫ్యాకల్టీ సభ్యులు, డీఎల్‌పీవో జి.నరసింహారావు, ఈవో కేజీఏ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

## అత్యంత ప్రాధాన్యతతో సమస్యలు పరిష్కరిస్తాం

● ఎస్పీ తుషార్ డూడి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 37 ఫిర్యాదులు



అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అత్యంత ప్రాధాన్యతతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన 37 మంది తమ సమస్యలను అర్జీల ద్వారా ఎస్పీకి వివరించారు. అర్జీదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఆయా పోలీసుస్టేషన్‌ల అధికారులకు వివరించి వెంటనే చట్టపరిధిలో విచారించి పరిష్కారమార్గం చూపాలని ఆదేశించారు. పోలీసుస్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి చట్టపరిధిలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, పీజీఆర్ఎస్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పతకాలు సాధించిన విద్యార్థులకు ఎస్పీ అభినందనలు

బాపట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడలలో పతకాలు సాధించిన లిటిల్‌ఏంజెల్స్ హైస్కూల్ విద్యార్థులను ఎస్పీ తుషార్ డూడి సోమవారం అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో క్రీడాకారులను అభినందించిన ఎస్పీ మాట్లాడుతూ మానసిక వికాసానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. 10వ తరగతి విద్యార్థి వై.సతీష్ 3 వేల మీటర్లు, 800 మీటర్ల అథ్లెటిక్స్ విభాగంలో బంగారుపతకం, రజితపతకాలు సాధించాడు. ఫెన్సింగ్ పోటీలలో 9వ తరగతి విద్యార్థి బి.ఆదిత్యసాయి, ఎస్.కిరణేశ్వరరెడ్డిలు రజిత, కాంస్యపతకాలు సాధించారు. వీరిని అభినందించిన ఎస్పీ రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రమేష్‌కుమార్, పీఈటీ గోపి తదితరులు ఉన్నారు.

## సాగునీటి సమస్యలు లేకుండా కృషి చేయాలి

● సభ్యులకు సూచించిన ఎమ్మెల్యే ఆనందబాబు



ఎమ్మెల్యే ఆనందబాబుకు పూలబొకే అందిస్తున్న సాయిబాబు, సాగునీటి సంఘ సభ్యులు

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాలకు నూతనంగా ఎన్నికైన సభ్యులు సాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. సోమవారం భట్టిప్రోలు మండలంలో సాగునీటి వినియోగదారుల సంఘ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి తమకు అవకాశం కల్పించినందుకు పూలబొకే అందించి దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆయకట్టు రైతులకు తగిన సమయంలో సాగునీరు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఇటీవల వెల్లటూరు ఛానల్ సర్‌ప్లస్ వంతెన దెబ్బతిన్న అక్విడేక్‌ను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. త్వరలోనే అక్కడ పనులు పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు నీటి సంఘం ఉపాధ్యక్షుడు డొక్కు శ్రీనివాసరావు, డైరెక్టర్లు కుంచె వెంకటేశ్వరరావు, శొంఠి శివాజీ, బసవపున్నయ్య, కనగాల నీటి సంఘం సభ్యులు వై.పాండురంగారావు, పి.గోవింద్, మాజీ వైస్ ఎంపీపీ యడ్ల జయశీలరావు, పార్టీ నాయకులు మాచర్ల నాగరాజు, అనగాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## యడ్లపాటికి మురళీకృష్ణ నివాళి

కొల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ మాజీ సభ్యుడు, మాజీ మంత్రి దివంగత యడ్లపాటి వెంకట్రావు 106వ జయంతి పురస్కరించుకుని కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ ఝెనేని మురళీకృష్ణ నివాళులర్పించారు. తెనాలిలోని యడ్లపాటి నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆయన ప్రతిమను సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు పంచాయతీ సభ్యులు గాదె చంటి తదితరులు పాల్గొన్నారు.

## శివునికి, చంద్రమౌళీశ్వరునికి అభిషేకాలు



శ్రీ గంగా లలిత సమేత చంద్రమౌళీశ్వరస్వామి

కర్లపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ అగ్రహారంలోని శ్రీ గంగాగౌరి సమేత బదరికేదారేశ్వరస్వామి శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం శివునికి భస్మాభిషేకం, పంచామృతాభిషేకాలను పురోహితులు కన్నుల పండుగగా నిర్వహించారు. మండలంలోని నల్లమోతువారిపాలెంలో మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ గంగాలలిత సమేత చంద్రమౌళీశ్వరస్వామి వారికి సోమవారం ఆర్ద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

## రైతుల అవసరాన్ని గుర్తించి సహకరించండి

● ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లు రైతుల అవసరాలను గుర్తించి సహకరించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. నియోజకవర్గస్థాయిలో జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షుల సమావేశాన్ని సోమవారం సాయంత్రం తెనాలి స్వర్ణ ఇన్ హోటల్ మీటింగ్ హాలులో నిర్వహించారు. ఎమ్మెల్యే నూతనంగా ఎన్నికైన సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి వెన్నెముక లాంటి రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నీటి సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పంటలు పండించుకునేందుకు సకాలంలో సాగునీటిని అందించాలని, కాల్వల్లో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపు డెక్కల ను తొలగించి చివర ఎకరా వరకు మీరు అందించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నీటి సంఘాల పేర్లు రాసుకుని ఏ ఒక్కపని చేయకుం డా చేసినట్లుగా బిల్లులు చూపించి కోట్లాది రూపాయలు డబ్బులు దోచేశారని విమర్శించారు. ఈ సంవత్సరం రైతులు ప్రత్యక్షంగా అనేక ఇబ్బందులు పడ్డ విష యం అందరికి తెలుసునని, చాలా మంది రైతులు సొంత డబ్బులతో కాల్వ లు బాగు చేయించారు. రైతు సేవ చేసే భాగ్యం నీటి సంఘాల కమిటీలకు దక్కినందుకు అదృష్టంగా భావించాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, ఐదు మండలాల పరిధిలో నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

## లోకహితం కోసమే క్రీస్తు జననం : ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుమర్రు గ్రామంలో ఆదివారం రాత్రి నక్కా ఆనందబాబు యూత్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ లోకహితం కోసమే ఏసుక్రీస్తు జన్మించారన్నారు. మనసు లగ్నం చేసుకుని ఆయనను ప్రార్థిస్తే అంతా మంచి జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా స్టార్ ప్రారంభించిన ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, మద్దిరాల జోసెఫ్, టీడీపీ నాయకులు కూచిపూడి రవి, ఈపూరు రమేష్, గోసె సురేష్, కీర్తి ప్రభాకరరావు, వల్లూరు వీరసుబ్రహ్మణ్యం, పులివర్తి మధుబాబు, ఆలపాటి వెంకట్రావు పాల్గొన్నారు. పాస్టర్ జైకుమార్ ప్రత్యేక ప్రార్థన చేసి ఆనందబాబును ఆశీర్వదించారు.

## హైస్కూల్‌ను సందర్శించిన సమగ్ర శిక్ష రాష్ట్ర కోఆర్డినేటర్



రికార్డులు పరిశీలిస్తున్న మల్లికార్జునరావు తదితరులు

అమృతలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సమగ్రశిక్ష స్టేట్ ఇంక్లూసివ్ కోఆర్డినేటర్ మల్లికార్జునరావు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ జ్యోత్స్న సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. అనంతరం రికార్డుల నిర్వహణ బాగుందని ప్రశంసించారు. అంగవైకల్యం ఉన్న పిల్లలకు ఏమేమి చేయాలో ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కనపర్తి నిరీక్షణరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన ధనుర్మాసం

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో అలివేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి

రేపల్లె, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ప్రారంభం కావటంతో సోమవారం పలు దేవాలయాల్లో అలివేలుమంగా పద్మావతి సమేత గోదాదేవికి తెల్లవారుజాము నుంచే ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని కోదండరామాలయం, ఉప్పూడి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహిళలు గోదాదేవి పారాయణ చేశారు. నగరం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలను పంపిణీ చేశారు.



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

● కొల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు నిర్వహించారు. చినపులివర్రులో సోమవారం సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజ నం హేమశంకరరావు గ్రామంలోని రామాలయం నుండి మేలుకొలుపు నగర సంకీర్తనలో మ హిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కూచిబొట్ల ఆనందమోహన్, కూచిబొట్ల లక్ష్మీగాయత్రి, మందలపు రాజకుమారి, సవరాల మాధవి, మల్లేశ్వరి పాల్గొన్నారు.



శ్రీరామలింగేశ్వరస్వామి

● అమృతలూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 16 : మండల పరిధిలోని పలు శైవ క్షేత్రాల్లో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పూజలు నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి, కూచిపూడి శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆరుద్ర నక్షత్రం పర్వదినం సందర్భంగా స్వామి వారికి పండ్ల రసాలు, 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకాలు చేశారు. అనంతరం పూర్ణాభిషేకం (అన్నాభిషేకం) చేశారు. గోవాడలో పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకట శ్రీనివాసశర్మ, అర్చకులు శ్రీధర్‌శర్మ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# చరిత్ర చూసొద్దాం రండి..



మహాచైత్యం నమూనా



కేంద్ర పురావస్తు సంగ్రహాలయం



మట్టిపాత్రలు



బుద్ధుని రాతి శిల్పం

● సజీవ సాక్ష్యాలుగా చారిత్రక ఆధారాలు

అమరావతిలో భారతప్రభుత్వం నిర్వహిస్తున్న పురావస్తు ప్రదర్శనశాల(మ్యూజియం) ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందింది. అమరావతిలో బౌద్ధమతం క్రీ.శ 14వశతాబ్దం వరకు ఆదరణ పొందింది. అందుకు సంబంధించిన ఆధారాలు, బుద్ధుని ధాతువులను ఉంచి, నిర్మించిన మహాచైత్యం దీనికి నిదర్శనం. ప్రస్తుతం అది శిథిలం అయినప్పటికీ దానిపై ఏర్పాటు చేసిన శిల్పసంపద, అమరావతి శిల్పకళను ప్రపంచానికి తెలియజేసింది. ఇవన్నీ ఇక్కడి మ్యూజియంలో చూడవచ్చు. అంతే కాకుండా రాతియుగంలో మానవులు వాడిన ఆయుధాలు, శిలాయుగంలో వాడిన ఆయుధాలు, నవీన యుగంలో వాడిన మట్టిపాత్రలు ఈ ప్రదర్శనశాలలో ఉన్నాయి. మన రాష్ట్ర చిహ్నం పూర్ణకుంభం కూడా అమరావతి శిల్పకళలో వెలుగుచూసిందే. వీటితోపాటు బుద్ధుని జీవిత ఘట్టాలను మ్యూజియంలోని శిల్పాలవలన ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. శాతవాహనుల కాలంనాటి నాణాలు కూడా ఇక్కడ భద్రపరిచారు.

మ్యూజియంలో ప్రవేశానికి 15 సంవత్సరాలు దాటినవారికి 5 రూపాయలు చెల్లించాలి. శుక్రవారం సెలవు. అమరావతి చేరుకోవడానికి విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, క్రోసూరు ప్రాంతాల నుండి రహదారి మార్గాల ద్వారా చేరుకోవచ్చు.



తవ్వకాలలో లభించిన గాంధార శిల్పం



పూర్ణకుంభం



పూర్వీకులు వినియోగించిన చేతి కడియాలు



అశోకుని కాలం నాటి ధర్మచక్రం




శాతవాహనకాలం నాటి సీసపు నాణెములు




పురాతన కంఠాభరణాలు




నవీన రాతియుగపు ఆయుధాలు

## తొలి స్నాతకోత్సవానికి.. ఎయిమ్స్ ముస్తాబు

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదించారు. 2015 అక్టోబరులో కేంద్ర మంత్రివర్గం ఈ నిధులను మంజూరుచేయగా 2017 సెప్టెంబరులో నిర్మాణ పనులు మొదలయ్యాయి. నిర్మాణపరంగా అన్ని హంగులను పూర్తిచేసుకున్న మంగళగిరి ఎయిమ్స్‌ను 2024 సెప్టెంబరు 29న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు.

**పచ్చని కొండల నడుమ..**

మంగళగిరి ఎయిమ్స్‌కు పలు ప్రత్యేకతలు కూడా ఉన్నాయని చెప్పుకోవాలి. ఇది రాష్ట్రానికి నడిబొడ్డున ఉండడం ఒక విశేషమైతే రాజధాని అమరావతిలో కూడా ఒక భాగంగా కుదురుకుంది. అంతేకాదు...దాదాపు రెండొందల ఎకరాల సువిశాల విస్తీర్ణంలో పచ్చని కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటైంది. ఒక విధంగా చెప్పాలంటే దేశంలో ఇప్పటివరకు ఏర్పాటైన ఎయిమ్స్ ఆస్పత్రులన్నింటిలోను దిబెస్ట్ ఎయిమ్స్ అన్న ఖ్యాతి మంగళగిరి ఎయిమ్స్‌కే దక్కింది.

మంగళగిరి ఎయిమ్స్‌కు తొలి డైరెక్టరుగా డాక్టర్ ముఖేష్ త్రిపాఠి పనిచేయగా ప్రస్తుతం డాక్టర్ మదబానందకర్ రెండవ డైరెక్టరుగా ఈ ఏడాది జనవరి 24 నుంచి సేవలను అందిస్తున్నారు. ఈయన సర్జికల్ ఆంకాలజిస్టుగా విశేష అనుభవాన్ని గడించారు. డాక్టర్ టీఎస్ రవికుమార్ వైస్ ఛాన్సలర్‌గా కొనసాగుతున్నారు. ఇక పాలకమండలి సభ్యులుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తాజాగా ఎన్నికయ్యారు.

**రూ. పదికే ఓపీ సేవలు**

మంగళగిరి ఎయిమ్స్‌లో రూ. పదికే వైద్యసేవలను అందిస్తున్నారు. అంతేకాదు... ఇతరత్రా శస్త్ర చికిత్సలకు, పలురకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఫీజులు బయటి లేబొరేటరీలతో పోల్చితే చాలా తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉన్నాయి. కంప్లీట్ బ్లడ్ పిక్చర్‌కు రూ. 365, ఫాస్టింగ్ అండ్ ర్యాండమ్ బ్లడ్ షుగర్‌కు కలిపి రూ. 48, లివర్ ఫంక్షనింగ్ టెస్ట్‌కు రూ. 225, కిడ్నీ ఫంక్షనింగ్ టెస్ట్‌కు రూ. 225, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్ టెస్ట్, ఈసీజీకి, ఛాతీ ఎక్స్‌రేకు రూ. 60, మామొగ్రఫీకి రూ. 630, అల్ట్రా సోనోగ్రఫీకి రూ. 323, యూరిన్ ఎనాలిసిస్‌కు రూ. 35, హెచ్ఐటీ రాపిడ్ టెస్ట్‌కు రూ. 150, హెచ్‌బీయస్ ఏజీ రాపిడ్ టెస్ట్‌కు రూ. 28 వంతున ఛార్జీలు ఉన్నాయి.

**అందుబాటులో ఉన్న విభాగాలు..**

మంగళగిరి ఎయిమ్స్‌లో దాదాపు 27 స్పెషాలిటీ సేవా విభాగాలు, మరో 12 సూపర్ స్పెషాలిటీ సేవా విభాగాలు అందుబాటులో ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ సేవా విభాగాలలో కాలిన గాయాలు, ప్లాస్టిక్ సర్జరీ, గుండె మరియు హృదయనాళ వ్యవస్థ విభాగం, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం, క్యాన్సర్ విభాగం, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, పిల్లల శస్త్ర చికిత్స, ఊపిరితిత్తుల వైద్యవిభాగం, రుమటాలజీ, కాన్సర్ శస్త్రచికిత్స, యూరాలజీ విభాగాలు ఉన్నాయి. ఇవిగాక మరికొన్ని ప్రత్యే ఓపీడీ క్లినిక్‌లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిలో సమగ్ర రొమ్ము సంరక్షణ, నొప్పి నివారణ, పాంక్రియాస్ క్లినిక్, జన్యు మరియు అరుదైన వ్యాధి క్లినిక్, అంటువ్యాధుల క్లినిక్, సౌందర్య శస్త్రచికిత్స అండ్ రీజెనరేటివ్ మెడిసన్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ క్లినిక్, జన్యుసంబంధిత కౌన్సిలింగ్, ఫుట్ అండ్ చీలమండల క్లినిక్, ఆర్థ్రోస్కోపీ క్లినిక్, కౌమార గైనకాలజీ క్లినిక్, వంధ్యత్వ క్లినిక్, గైనీ అంకాలజీ క్లినిక్, హీమోథెరపీ క్లినిక్ వంటి ప్రత్యేక క్లినికల్ ఓపీడీ సేవలను ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చారు.

## క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను ఆస్వాదించాలి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలో మూడోస్థానం సాధించిన గుంటూరు బాలికల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తితోనే గెలుపు, ఓటములను ఆస్వాదించాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఫిరంగిపురం దీనాపూర్ ఆవరణలో ఆర్‌సీజేసీ కళాశాల, పల్నాడు జిల్లా రగ్బీ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో రెండో రోజు బహుమతి ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో చీకటి, వెలుగు, కష్టాలు, సుఖాలవలె ఆటల్లో గెలుపు ఓటములు ఉంటాయని ఆయన తెలిపారు. క్రీడా స్ఫూర్తితో ఉండి ఓడిన జట్లు మరింత కష్టపడి ముమ్ముందు గెలిచేలా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్ర మంలో రాష్ట్ర స్థాయిలో బాలకల విభాగంలో సత్యసాయి జిల్లా జట్టుకు మొదటి బహుమతి, తూర్పు గోదావరి జిల్లా రెండో బహుమతి, గుంటూరు జిల్లా మూడో బహు మతి, అలాగే బాలుర విభాగంలో కర్నూలు జట్టుకు ప్రథ మ బహుమతి, ప్రకాశం జిల్లా ద్వితీయ బహుమతి, నెల్లూరు జట్టుకు తృతీయ బహుమతులను ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో కార్ప్ సంస్థ వ్యవస్థాపకురాలు ఎం స్వర్ణలతాదేవి, ఆర్‌సీజేసీ కళాశాల కరస్పాండెంట్ కే మేరీ, పల్నాడు జిల్లా రగ్బీ అసోసియే షన్ జిల్లా ప్రెసిడెంట్ ఈ కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ రామాంజనేయులు, ఆర్‌సీజేసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్, సెయింట్ జేవీఆర్ పార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వీ జీవన్ మణిబాబు, బాలబాట డిప్యూటీ డైరెక్టర్ టీ అమరనాథ్, టీ డానియేలు, ఎంవీ సుబ్బారావు, ట్రెజరర్ ఎం ప్రకాష్, ఆనంద్ విజయబాబు, చుక్కా కొండయ్య, టీ హృదయరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా త్రికోటేశ్వరస్వామి ఆరుద్రోత్సవం

● స్వామికి ఇరుముడులు సమర్పించిన మేధా దక్షణామూర్తి స్వాములు



శ్రీ త్రికోటేశ్వర స్వామి మూలవిరాట్

కోటప్పకొండ(నరసరావుపేట), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆరుద్రోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. కోటయ్య స్వామికి మహన్యాస పూరక రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి 12 గంటల సమయంలో పాత కోటేశ్వర స్వామి ఆలయం వద్ద కర్పూర జ్యోతి దర్శనం చేసుకొని భక్తులు పులకించి పోయారు. వివిధ జిల్లాల నుంచి నుంచి మేధా దక్షణామూర్తి మాలధారణ స్వాములు ఇరు ముడులతో కోటయ్య సన్నిధికి చేరుకున్నారు. కర్పూర జ్యోతి దర్శనం అనంతరం స్వామికి ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, ఎండు ఫలాలు, సుగంధ ద్రవ్యాలు, విభూది, కుంకుమ, గంధం, తైలంలతో అభిషేకాలు నేత్ర పర్వంగా జరిగాయి. ఆలయంలో స్వామికి ఆరుద్రోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున స్వామికి అన్నాభిషేకం జరగనుంది. అనంతరం త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకరణ చేస్తారు. ఉదయం 8 గంటలకు యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర హోమాలు జరగనున్నాయి. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. కొండపై ఉన్న పాత కోటేశ్వర స్వామిని అరవిందబాబు దర్శించుకున్నారు. స్వామికి ఆయన ప్రత్యేక అభిషేకాలు చేశారు.



పాత కోటేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



ఇరుముడులతో కొండకు చేరుకున్న గోనెపూడికి చెందిన మేధా దక్షణామూర్తి మాలధారణ స్వాములు



అర్ధరాత్రి మార్కెట్ సెంటర్‌లో ఆకు కూరల వ్యాపారుల సందడి

## పరీక్షా కాలమ్



### చేతి రాత, అక్షరదోషాలపై దృష్టిపెట్టండి

● ప్రణాళికతో పది తెలుగులో అత్యధిక మార్కులు

గుంటూరు విద్య, 16 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు టైమ్ టేబుల్ ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో పరీక్షకు సిద్ధం అయ్యే విద్యార్థుల కోసం ఇటు ప్రభుత్వ పాఠశాలల్లో అటు ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి. పాఠశాలల్లో పరీక్షల వాతావరణం మొదలైంది. ఈ నేపథ్యంలో పది విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ఎక్కువ మార్కులు ఎలా తెచ్చుకోవాలి? సబ్జెక్టులు ఎలా ప్రిపేర్ కావాలి? అనే విషయాలను ఆంధ్రజ్యోతి నిపుణులైన ఉపాధ్యాయుల సహకారంతో వివరిస్తోంది. ఇందులో భాగంగా తొలుత జరిగే తెలుగు పరీక్షకు ఎలా సిద్ధం కావాలో గుంటూరు నగరపాలక సంస్థ ఎస్‌కేబీపీ ఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు జరుగుమాల జేమ్స్ వివరిస్తున్నారు.

పదవ తరగతిలో తెలుగు సబ్జెక్టు విషయానికి వస్తే ప్రధానంగా అవగాహన ప్రతిస్పందన, వ్యక్తీకరణ, సృజనాత్మకత, భాషాంశాలు ఉంటాయి. మొదటి పాఠ్యపుస్తకం 12 పాఠాలు ఉంటాయి. ఉపవాచకంలో రామాయణ కథ నుంచి ప్రశ్నలు వస్తాయి. ఆయా పాఠ్యాంశాల నుంచి వచ్చే ప్రశ్నల్ని ప్రణాళికాబద్ధంగా చదువుకుని పరీక్షకు సిద్ధం అయితే గణితంతో సమా నంగా అత్యధిక మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంది.

ప్రధానంగా కవి పరిచయాలు, నేపథ్యం, ప్రక్రియ, ఉద్దేశం వంటివి ఎక్కువ చదువుకోవాలి. ఆయా అంశాల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంది. ఇందులో మార్కులు తగ్గించడానికి అవకాశం ఉండదు. సమాధానాలు ఎంత బాగారాసినా అక్షరదోషాలు లేకుండా చూసుకోవాలి.

● ఆయా ప్రశ్నలకి జవాబులు పాయింట్ల వారీగా రాస్తే మార్కులు ఎక్కువ వస్తాయి. తరువాత తెలుగు వ్యాకరణం ఎక్కువగా చదువుకొని సాధన చేయాలి. ఇందులో అలంకారాలు, చందస్సు, అర్థాలు, వ్యతిరేక పదాలు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్తి అర్థాలు, వాక్యాల వంటి భిన్నరకాల అంశాలపై ప్రశ్నలు వస్తాయి. ఆయా ప్రశ్నల విషయంలో కూడా అక్షర దోషాలు లేకుండా కచ్చితంగా రాయగలిగితే అత్యధిక మార్కులు వస్తాయి.

● ఇంకా ప్రకృతి వికృతి, సొంత వాక్యాలు వంటి ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇవన్నీ ప్రణాళిక బద్ధంగా చదువుకుని పరీక్షకు సిద్ధం కావాలి. ఆయా అంశాలకు సంబంధించి 32 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.

● ఉపవాచకంలో రామాయణం కథ ఉంటుంది. ఇందులో రామాయణంలో పాత్రల గురించి ప్రధానంగా ప్రశ్నలు వస్తాయి. ఉదాహరణకు సీతమ్మ, రాముడు, దశరథ మహారాజు, మందర, కైక, గుహుడు, విభీషణుడు, జటాయువు తదితరుల పాత్రల గురించి రాయాలి. ఇవన్నీ నాలుగు మార్కుల ప్రశ్నలు. ఇక ఎనిమిది మార్కుల ప్రశ్నల విషయానికి వస్తే సీతారామ కల్యాణం, రావణాసురుడు సీతమ్మను అపహరించిన విధానం, రామ లక్ష్మణ భరత, శత్రుఘ్నులు జన్మించిన విధానం, రామ రావణ యుద్ధం ఏవిధంగా జరిగింది? ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇవి తప్పులు లేకుండా రాస్తే మంచి మార్కులు వస్తాయి.

● అదేవిధంగా పద్యాలు, చిన్న పద్యాలు, అపరిచిత పద్యాలు, అపరిచిత గద్యం ఉంటాయి. పద్యం, గద్యం ఇచ్చి దాని కింద నాలుగు ప్రశ్నలు ఇచ్చి చిన్నచిన్న వాక్యాలుగా సమాధానాలు రాయాల్సి ఉంది. ఈ పద్యాలు పాఠ్యపుస్తకాలు లేదా బయటనుంచి ప్రశ్నాపత్రంలో ఇచ్చే అవకాశం ఉంది.

● పరీక్ష హాల్లో విద్యార్థి ప్రవేశించగానే ఎటువంటి ఆందోళన చెందకూడదు. ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలి. తాను చదివిన పాఠ్యాంశాల నుంచే ప్రశ్నలు వస్తాయనే ఆత్మవిశ్వాసంతో ఉండాలి.

● ముందుగా ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండుసార్లు చదవాలి. తరువాత బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి అక్షర దోషాలు లేకుండా విరామ చిహ్నాలు పాటిస్తూ పరీక్ష రాయాలి.

● ప్రశ్నలకు జవాబులు రాసే సమయంలో జవాబుకు జవాబుకు మధ్యలో గీత గీసుకోవడం చాలా అవసరం. సెక్షన్ నెంబర్ ప్రశ్న నెంబరు తప్పు లేకుండా వేయాలి. రాసిన పేపర్ మొత్తం చివరలో ఒకసారి పరిశీలించుకోవాలి. సమయాన్నిబట్టి తప్పులు ఏమైనా ఉంటే సరిదిద్దుకోవాలి.



- జరుగుమాల జేమ్స్, తెలుగు ఉపాధ్యాయుడు, ఎస్‌కేబీపీఎంసీ ఉన్నత పాఠశాల, వేణుగోపాల నగర్ గుంటూరు

## నిశీథిలో.. నగరం ఇలా..







డివైడర్‌పై చలిలోనే నిద్దుర..

చిరు వ్యాపార బళ్లకు రక్షణ..



నగరమంతా నిద్ర మత్తులో జోగుతున్న వేళ.. ఆకాశం నుంచి రాలే మంచు బిందువులు పొగలా మారి.. కారుచీకట్లు తొలగించే కాంతులను కమ్మిన సమయాన. పడుకోవడానికి ఇళ్లు.. కప్పుకోవడానికి రగ్గు లేక ఫుట్‌పాత్‌పై ప్లాస్టిక్ సంచి ఆదరవుతో ఒకరు గురకలు పెడుతుంటే. తెల్లారకముందే బతుకుదెరువు కోసం.. చెత్త ఏరుకుంటూ.. ఒడిలో చంటి బిడ్డతో ఒకరు.. వారిని రిక్షాలో కూర్చోబెట్టి ఆ బరువును నెట్టుకుంటూ మరొకరు.. ఆకుకూరల అమ్మకాల కోసం అప్పుడే బారులుతీరిన జనం.. ఇదీ సోమవారం తెల్లవారుజామున గుంటూరు నగర ముఖ చిత్రం.

గుంటూరు (ఆంధ్రజ్యోతి).



విద్యుత్ వెలుగులు.. మంచు దుప్పటితో కనువిందు చేస్తున్న గుంటూరు నగర రహదారులు

# హైవే నిర్మాణానికి అక్రమంగా గ్రావెల్





కొండ మట్టి తరలింపును అడ్డుకుంటున్న కొర్రపాటివారిపాలెం గ్రామస్థులతో బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధుల వాగ్వివాదం .. గ్రావెల్‌ను తరలిస్తున్న కొండ ఇదే

- తరలింపును అడ్డుకున్న కొర్రపాటిపాలెంవాసులు
- గ్రామస్థలకు కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధుల మధ్య వాగ్వివాదం
- అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తూ పోలీస్‌లకు ఫిర్యాదు
- పోలీసుల తీరుపై ఆగ్రహం

అద్దంకి/తాళ్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం కొండను తవ్వి గ్రావెల్ తరలించడాన్ని తాళ్లూరు మండలం కొర్రపాటివారిపాలెం గ్రామస్థులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. అద్దంకి మండలంలోని మోదేపల్లి రెవెన్యూ పరిధిలో కొండ ఉంది. తాళ్లూరు మండలం కొర్రపాటివారిపాలెంకు సమీపంలో ఈ కొండ ఉంది. కొండ పరిసర ప్రాంతంలో కొ ర్రపాటివారిపాలెం రైతులకు భూములు ఉన్నాయి. గ్రామస్థులు పశువులు, గొర్రెలు, మేకలను ఈ కొండ వద్దకే మేతకు తీసుకెళ్తుంటారు. ఈ క్రమంలో విజయవాడ - బెంగళూరు రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ రోడ్డు నిర్మాణం కోసం కొండ మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల 21వ తేదీన కొర్రపాటివారిపాలెం రైతులు గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు. దీంతో అప్పట్లో గ్రావెల్ తరలింపును నిలిపి వేసి రెండు రోజుల నుంచి మరలా గ్రావెల్ తరలింపును ప్రారంభించడంతో సోమవారం ఉదయం కొర్రపాటివారిపాలెం గ్రామస్థులు రాజకీయ పార్టీలను పక్కన పెట్టి అందరు మూకుమ్మడిగా వచ్చి గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, గ్రామస్థుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగింది. అనుమతులు చూపించాలని గ్రామస్థులు కోరగా.. ఎలాంటి సమాధానం చెప్పకుండా దాట వేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రావెల్ తరలింపును ఒప్పుకునేది లేదని, పశువులకు గ్రాసం ఇబ్బంది కలుగుతుందని గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో తాత్కాలికంగా గ్రావెల్ తరలింపును నిలిపి వేశారు. రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు తాళ్లూరు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కొర్రపాటివారిపాలెం గ్రామంలోకి వెళ్లి గ్రావెల్ తరలింపు అడ్డుకోరాదని చెప్పడంపట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి మండల పరిధిలో ఉన్న కొండ నుంచి గ్రావెల్ తరలింపును అడ్డుకోగా తాళ్లూరు పోలీసులు జోక్యం చేసుకోవడం పట్ల గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వానికి చెందిన కొండ నుంచి గ్రావెల్ తరలింపును అడ్డుకోవాల్సిన పోలీసులు, కాంట్రాక్టర్‌లకు వత్తాసుగా రైతులను హెచ్చరించడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొండ నుంచి గ్రావెల్ తరలింపును నిలిపి వేయాలని కొ ర్రపాటివారిపాలెం రైతులు కోరుతున్నారు.



నీటి సంఘం ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

## రైతుల సంక్షేమం కోసమే సాగు నీటి సంఘాల ఎన్నికలు

- వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్నదాతలకు తీరని కష్టాలు
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈ ఎన్నికల్లో రైతులకు సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో ఉన్న నాయకులను ఎన్నికల్లో ఎన్నుకున్నారన్నారు. సోమవారం ఏలూరి క్యాంప్ కార్యాలయంలో సాగు నీటి సంఘాల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నీటి సంఘాలను బలోపేతం చేయడానికి ఎన్నికలు నిర్వహించారన్నారు. ఆయకట్టు పరిధిలోని రైతులు ఈ సంఘాలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు అయ్యారన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని ఏలూరి అన్నారు. వైసీపీ హయాంలో కాలువను మరమ్మతులు చేయకుండా రైతుల ప్రయోజనాలను దెబ్బ తీశారన్నారు. కనీసం కాలువల్లో చిల్లచెట్లు, ముళ్ల పొదలను తొలగించిన దాఖలాలు కూడా లేవన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కాలువల అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. చిట్టచివరి భూముల రైతులకు కూడా నీరు అందించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో మళ్లీ రైతులకు మంచిరోజులు వచ్చాయని ఏలూరి స్పష్టం చేశారు. సాగునీటి సంఘాలకు తన నుంచి పూర్తిసహకారం ఉంటుందన్నారు. చంద్రబాబు నేతృత్వంలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి సాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. పట్టిసీమ ప్రాజెక్టుతో కొమ్మమూరుకు ఇప్పటికే సాగునీరు అందించామని గుర్తు చేశారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే ఏలూరిని నూతన కమిటీ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌లు సన్మానించి అభిమానం చాటుకున్నారు.

## విద్యార్థులను తీర్చిదిద్దాలి

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో టీంలుగా ఏర్పాటు అయి బడి మానేసిన విద్యార్థులను గుర్తించి వారిని తీర్చి దిద్దాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కిషోర్ బాలిక వికాసం కార్యక్రమంలో భాగంగా సీడీపీవో సుధ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాలలో ప్రతివారం ఒక్కో అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్ర మంలో వైద్యాధికారి రమీజ్ అహ్మద్, ఎంఈవోలు వస్రంనాయక్, రమేష్, పలు గ్రా మాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## భవనాసి కాలువలో పూడిక తొలగింపు



పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న నీటి సంఘ అధ్యక్షుడు సుబ్బారావు, టీడీపీ నేతలు

అద్దంకి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భవనాసి కాలువలో పూడిక, నాచు తొలగింపు పనులను సోమవారం నీటి సంఘం అధ్యక్షుడు నర్రా సుబ్బారావు ప్రారంభించారు. నాచు, పూడిక పేరుకు పోవడంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సుబ్బారావు, మిగిలిన కమిటీ సభ్యులతో కలిసి సోమవారి ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటు చేయించి పూడికతీత పనులు ప్రారంభించారు. పూడిక తీత పనులు చేపట్టడం పట్ల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చికిత్స పొందుతున్న వివాహిత మృతి

గవినివారిపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెంలో ఆదివారం కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత సోమవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పిట్టు రవికుమార్, భానుప్రియ దంపతులు. వీరికి మూడేళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. అయితే రెండు రోజులుగా వీరిద్దరి మధ్య వివాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో ఆదివారం ఇంటిపై అంతస్తులో చీరతో ఉరికి పాల్పడింది. ఈక్రమంలో హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతిచెందింది. ఈమేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

తోటవారిపాలెం (చీరాలటౌన్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని మరో వ్యక్తి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తోటవారిపాలెంకు చెందిన మార్పు దీనరాజు సోమవారం నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన సలగల ప్రేమ్‌బాబు అడ్డగించాడు. పాతకక్షలు మనసులో పెట్టుకుని తన ద్విచక్ర వాహనాన్ని అడ్డుగా పెట్టి అసభ్యంగా దూషించాడు. దీంతో దీనరాజు ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి పనులు

- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలో మొదలైన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు
- పీసీపల్లిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో గ్రామల్లో మౌలిక వసతులు కల్పనను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విమర్శించారు. పీసీపల్లిలో రూ.82లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో ఆయన మాట్లాడుతూ సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలికవసతులు కల్పించినప్పుడే గ్రా మాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఎక్కడా తట్టమట్టి కూడా పోయలేదని విమర్శించారు. మండలంలో ఇప్పటికే ఫేజ్ 1లో 3కోట్ల రూపాయలతో 11గ్రామాల్లో సీసీరోడ్లు వేశామన్నారు. ఫేజ్2లో 2.45కోట్లతో ఎస్సీకాలనీల్లో సీసీరోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించినట్లు చె ప్పారు. ఎంపీడీవో పద్మాకరశ ర్మ, మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రా మయ్య, పు వ్వాడి నాగరాజు, వడ్డెంపూడి వెంకట్(చిన్నా), జనసేన నాయకులు మాదాసు రమేష్, బండారు రాజు, టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు బద్దిపూడి ఎబినేజరు, గుదేవారిపాలెం, నేరేడుపల్లి సర్పంచ్‌లు కనపర్తి శ్యాంసన్, పల్లా మల్లికార్జున్, సత్యంరెడ్డి, లింగారెడ్డి, జోసఫ్, బ్రహ్మారెడ్డి, చిన్నా, వీరయ్య, యోగయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## తొలి స్నాతకోత్సవానికి.. ఎయిమ్స్ ముస్తాబు

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదించారు. 2015 అక్టోబరులో కేంద్ర మంత్రివర్గం ఈ నిధులను మంజూరుచేయగా 2017 సెప్టెంబరులో నిర్మాణ పనులు మొదలయ్యాయి. నిర్మాణపరంగా అన్ని హంగులను పూర్తిచేసుకున్న మంగళగిరి ఎయిమ్స్‌ను 2024 సెప్టెంబరు 29న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు.

**పచ్చని కొండల నడుమ**

మంగళగిరి ఎయిమ్స్‌కు పలు ప్రత్యేకతలు కూడా ఉన్నాయని చెప్పుకోవాలి. ఇది రాష్ట్రానికి నడిబొడ్డున ఉండడం ఒక విశేషమైతే రాజధాని అమరావతిలో కూడా ఒక భాగంగా కుదురుకుంది. అంతేకాదు... దాదాపు రెండొందల ఎకరాల సువిశాల విస్తీర్ణంలో పచ్చని కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటైంది. ఒక విధంగా చెప్పాలంటే దేశంలో ఇప్పటివరకు ఏర్పాటైన ఎయిమ్స్ ఆస్పత్రులన్నింటిలోను దిబెస్ట్ ఎయిమ్స్ అన్న ఖ్యాతి మంగళగిరి ఎయిమ్స్‌కే దక్కింది.

మంగళగిరి ఎయిమ్స్‌కు తొలి డైరెక్టరుగా డాక్టర్ ముఖేష్ త్రిపాఠి పనిచేయగా ప్రస్తుతం డాక్టర్ మదబానందకర్ రెండవ డైరెక్టరుగా ఈ ఏడాది జనవరి 24 నుంచి సేవలను అందిస్తున్నారు. ఈయన సర్జికల్ ఆంకాలజిస్టుగా విశేష అనుభవాన్ని గడించారు. డాక్టర్ టీఎస్ రవికుమార్ వైస్ ఛాన్సలర్‌గా కొనసాగుతున్నారు. ఇక పాలకమండలి సభ్యులుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తాజాగా ఎన్నికయ్యారు.

**రూ. పదికే ఓపీ సేవలు**

మంగళగిరి ఎయిమ్స్‌లో రూ. పదికే వైద్యసేవలను అందిస్తున్నారు. అంతేకాదు... ఇతరత్రా శస్త్ర చికిత్సలకు, పలురకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఫీజులు బయటి లేబొరేటరీలతో పోల్చితే చాలా తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉన్నాయి. కంప్లీట్ బ్లడ్ పిక్చర్‌కు రూ. 365, ఫాస్టింగ్ అండ్ ర్యాండమ్ బ్లడ్ షుగర్‌కు కలిపి రూ. 48, లివర్ ఫంక్షనింగ్ టెస్టుకు రూ. 225, కిడ్నీ ఫంక్షనింగ్ టెస్టుకు రూ. 225, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్ టెస్ట్, ఈసీజీకి, ఛాతీ ఎక్స్‌రేకు రూ. 60, మామొగ్రఫీకి రూ. 630, అల్ట్రా సోనోగ్రఫీకి రూ. 323, యూరిన్ ఎనాలిసిస్‌కు రూ. 35, హెచ్ఐటీ రాపిడ్ టెస్టుకు రూ. 150, హెచ్‌బీయస్ ఏజీ రాపిడ్ టెస్టుకు రూ. 28 వంతున ఛార్జీలు ఉన్నాయి.

**అందుబాటులో ఉన్న విభాగాలు**

మంగళగిరి ఎయిమ్స్‌లో దాదాపు 27 స్పెషాలిటీ సేవా విభాగాలు, మరో 12 సూపర్ స్పెషాలిటీ సేవా విభాగాలు అందుబాటులో ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ సేవా విభాగాలలో కాలిన గాయాలు, ప్లాస్టిక్ సర్జరీ, గుండె, హృదయనాళ వ్యవస్థ విభాగం, ఎండో క్రైనాలజీ అండ్ మెటబాలిజం, క్యాన్సర్ విభాగం, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, పిల్లల శస్త్ర చికిత్స, ఊపిరితిత్తుల వైద్యవిభాగం, రుమటాలజీ, కేన్సర్, యూరాలజీ విభాగాలు ఉన్నాయి. మరికొన్ని ప్రత్యేక ఓపీడీ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిలో సమగ్ర రొమ్ము సంరక్షణ, నొప్పి నివారణ, పాంక్రియాస్ క్లినిక్, జన్యు అరుదైన వ్యాధి క్లినిక్, అంటువ్యాధుల క్లినిక్, సౌందర్య శస్త్రచికిత్స అండ్ రీజెనరేటివ్ మెడిసన్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ క్లినిక్, జన్యుసంబంధిత కౌన్సిలింగ్, ఫుట్ అండ్ చీలమండల క్లినిక్, ఆర్థ్రోస్కోపీ క్లినిక్, కౌమార గైనకాలజీ క్లినిక్, వంధ్యత్వ క్లినిక్, గైనీ అంకాలజీ క్లినిక్, హీమోథెరపీ క్లినిక్ వంటి ప్రత్యేక క్లినికల్ ఓపీడీ సేవలను ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చారు.

## నేడు డీసీ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక

అద్దంకి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక మంగళవారం జరగనుంది. అద్దంకి, పంగులూరు డీసీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక అద్దంకి ఎన్నెస్పీ కార్యాలయం వద్ద, సంతమాగులూరు డీసీ ఎన్నిక సంతమాగులూరు ఎన్నెస్పీ కార్యాలయం, కొమ్మాలపాడు డీసీ ఎన్నిక కొమ్మాలపాడు సమీపంలో ఏబీసీ 24వ మైలు సెక్షన్ కార్యాలయం వద్ద జరగనున్నాయి. డీసీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకునేం

దొంగ సొత్తు కొన్న వ్యక్తి అరెస్టు

## రూ.15.50లక్షల విలువైన సొత్తు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్పీ



చోరీ వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలలో దొంగతనం చేసిన వస్తువులను కొని తిరిగి విక్రయిస్తున్న శ్రీకాకుళం జిల్లా సీతంపేటకు చెందిన కాకినాడ కృష్ణారావు అలియాస్ రామకృష్ణను ఆదివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద రూ.15.50లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ ఏఆర్.దామోదర్ వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో నాగులుప్పలపాడు మండలం చదలవాడలో రఘునాయకస్వామి దేవాలయంలో తాళాలు పగులకొట్టి వెండి, బంగారు ఆభరణాలను దొంగలు అపహరించుకెళ్లారు. అదేవిధంగా బి.నిడమనూరు సాయిబాబా గుడిలో చోరీకి పాల్పడ్డారు. రెండు చోట్ల చోరీకి పాల్పడింది ఒకే ముఠా. ఈ ముఠా దొంగిలించిన వస్తువులను కాకినాడ కృష్ణారావు కొనుగోలు చేశాడు. ఈ దొంగల ముఠాలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన సవర సిపన్న అలియాస్ రవి, సవర బోగేష్, తెలంగాణలోని మెదక్ జిల్లాకు చెందిన బత్తిన శ్రీకాంత్‌లను గతనెల 24న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. ఈ ముఠా వద్ద నుంచి కృష్ణారావు 100 దేవాలయాలకు సంబంధించిన 300 కిలోలు వెండి కొనుగోలు చేశాడని తెలిపారు. ఆదివారం రాత్రి కృష్ణారావు శ్రీకాకుళం నుంచి హౌరా రైలులో దొంగ సొత్తుతో చెన్నై వెళుతుండగా ఒంగోలులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 15 కిలోలు వెండి, 4 గ్రాముల బంగారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విలువ రూ.15.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. కాగా కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్న ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్ బాబు, నాగులుప్పలపాడు ఎస్సై బి.శ్రీకాంత్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## చిన్నారులపై.. చలి పంజా

(5వ పేజీ తరువాయి)

ఇన్‌ఫ్లుయెంజా ఏ, బీ అనే రెండు రకాలు ఉంటాయి. ఏ రకం ఊపితిత్తులపై ప్రభావం చూపడంతో పాటు అలసట, జ్వరం, ఒళ్లనొప్పులు వంటి లక్షణాలను కలిగిస్తుంది. చలి కాలంలో ఇది విజృంభిస్తుంది. రోగుల దగ్గులు, తుమ్ముల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులువుగా వ్యాపిస్తాయి. "నగరంలో ఫ్లూ బాధిత చిన్నారుల్లో మధ్య తరహా వ్యాధి లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయి. బాధితులు ఆసుపత్రుల్లో చేరి చికిత్సలు పొందాల్సినంత తీవ్రస్థాయిలో వ్యాధి లక్షణాలు లేవని" గుంటూరు జీజీహెచ్ పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రికి వస్తున్న కేసుల్లో వ్యాధి లక్షణాలు తీవ్రంగా ఉన్న వారిని మాత్రం అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందిస్తున్నట్లు ఆయన వివరించార

**జాగ్రత్తలు ఇవీ**

- పెద్దలు ఏడాదిలోపు చిన్నారులను పట్టుకునే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. మాస్క్ ధరించాలి. తల్లిపాలే శిశువులకు అందించాలి
- ఏడేళ్లలోపు పిల్లలను సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఏడు గంటల వరకు బయటకు తీసుకెళ్లకూడదు.
- రాత్రి సమయాల్లో ఏసీల వినియోగం పూర్తిగా మానేయాలి. చిన్నారులు నిద్రించే గదుల్లో ఫ్యాన్ల వేగం తగ్గించాలి
- చలి కాలంలో ఐస్‌క్రీములు, కూల్‌డ్రింకులు వంటి చల్లని పదార్థాలను పిల్లలకు ఇవ్వకూడదు. గోరువెచ్చని నీళ్ల తాగించాలి
- ఐదేళ్ల వచ్చే వరకు ప్రతి ఏడాది ఫ్లూ వ్యాక్సిన్ ఇప్పించడం మంచిది. ఆస్తమా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇన్‌హేలర్లు వినియోగించాలి.
- చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచేలా పోషకాహారం అందించాలి.

తక్కువ వ్యాధి నిరోధక శక్తి ఉండటం వల్లే చలికాలంలో ఎక్కువగా వ్యాధుల బారిన పడతారు.

- మూడు రోజులకు మించి జలుబు, దగ్గు ఉంటే వైద్యుడిని సంప్రదించి చికిత్సలు చేయించాలి.

# విధులకు అతిథులు.. కాలానికి అతీతులు

- గ్రామ, వార్డు సచివాలయాలు వెలవెల
- ఏళ్లు గడుస్తున్నా గాడిన పడని నిర్వహణ
- పర్యవేక్షణలో కొరవడిన స్పష్టత
- నియంత్రణ లేక ఇష్టారీతిన వ్యవహరిస్తున్న సిబ్బంది
- సమయానికి సిబ్బంది రాక జనం అవస్థలు
- సర్వే పేరుతో కొందరు, శిక్షణ కోసం మరికొందరు

ఒంగోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాలు మొక్కుబడిగా నడుస్తున్నాయి. వాటిలో పనిచేస్తున్న సిబ్బంది వ్యవహారం అంతా ఇష్టారాజ్యంగా మారింది. సమయ పాలన పాటించడం లేదు. పైగా సర్వేలు, ఇతర క్షేత్రస్థాయి పనుల పేరులతో విధులకు డుమ్మాకొడుతున్నారు. ఇందుకు సోమవారం ఆంధ్రజ్యోతి విజిట్ నిర్వహించగా సచివాలయాలలో కనిపించిన దృశ్యాలే నిదర్శనం. గత వైసీపీ పాలనలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయగా ఐదేళ్లు గడుస్తున్నా అవి ఇంకా గాడిన పడలేదు. జిల్లాలో మొత్తం 719 సచివాలయాలు ఉండగా గ్రామాల్లో 14 మంది, పట్టణాల్లో 11 మంది వంతున దాదాపు 8వేల మంది సిబ్బంది వాటిలో పనిచేస్తున్నారు. సగటున ప్రతి ఐదువేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసిన అప్పటి ప్రభుత్వం అందులో అడ్మిన్ సెక్రటరి పర్యవేక్షణలో హెల్త్, ఇంజనీరింగ్, రెవెన్యూ, సర్వేయర్, సంక్షేమ, గ్రామ పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, పశుసంవర్థక, విద్యుత్ ఇలా పలు శాఖల సిబ్బందిని నియమించారు. అయితే ఆ సిబ్బంది రోజువారి పరితీరు, పర్యవేక్షణగా విషయాలు అంతా గందరగోళంగా ఉన్నాయి.

**వస్తారో రారో తెలియదు**

ప్రధాన శాఖల సిబ్బంది ఆయా శాఖల జిల్లా, మండల స్థాయి అధికారుల సూచనలకు అనుగుణంగా ఉంటుండగా అడ్మిన్ సెక్రటరీలు పట్టణాల్లో మునిసిపల్ కమిషనర్లు, గ్రామాల్లోని వారు ఎంపీడీవో పర్యవేక్షణలో ఉన్నారు. ఎంపీడీవో, కమిషనర్ల ద్వారా జీతభత్యాల చెల్లింపులు జరుగుతాయి. అదేసమయంలో రోజువారీ పనులు ఆయా శాఖల వారీ ఉంటున్నాయి. దీంతో సచివాలయాల్లో సిబ్బంది పర్యవేక్షణ క్రమపద్ధతిలో ఉండటం లేదు. దాంతోనే ఏ సిబ్బంది ఎక్కడకు వెళ్లారు, ఆఫీసుకు వస్తారా రారా అన్న విషయం కూడా తోటి సిబ్బంది చెప్పే పరిస్థితి ఉండటం లేదు. ఇదేవిషయం సోమవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన విజిట్‌లో మరోసారి స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సోమవారం కలెక్టర్ నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులు, సిబ్బంది అందరూ కార్యాలయాల్లో అందుబాటులో ఉండి ప్రజా విజ్ఞప్తులను స్వీకరించి వాటికి పరిష్కారం చూపాలి. అయితే జిల్లాలోని సచివాలయాల్లో ఆ పరిస్థితి అత్యధిక ప్రాంతాల్లో కనిపించలేదు.

**కార్యాలయాలకు డుమ్మా**

సుమారు 50కిపైగా సచివాలయాలను ఆంధ్రజ్యోతి బృందం విజిట్ చేయగా 90శాతం సచివాలయాల సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాలేదు. ప్రస్తుతం జిల్లాలో హౌస్‌హోల్డ్ సర్వే జరుగుతుండగా ఆ పేరు చెప్పి అనేకమంది సిబ్బంది విధులకు హాజరు కాలేదు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉదయం 10 వరకు సర్వే నిర్వహించిన పదిన్నర గంటలకు కార్యాలయాల విధులకు హాజరుకావాల్సి ఉండగా అత్యధిక ప్రాంతాల్లో సర్వే పేరుతో ఆఫీసుకు డుమ్మాకొట్టారు. మరికొన్ని సచివాలయాల సిబ్బంది మండల కార్యాలయాల్లో శిక్షణ తరగతుల పేరుతో హాజరు కాలేదు. సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా పైఅధికారులు అలాంటిరోజు శిక్షణ పేరుతో సిబ్బందిని కార్యాలయాలకు పిలవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అలా ఒకవైపు సర్వే పేరుతో, మరోవైపు శిక్షణ పేరుతో అధికభాగం సిబ్బంది కార్యాలయాలకు హాజరుకాకపోగా మిగిలిన వారు సకాలంలో విధులకు హాజరు కాకపోవడంతో జిల్లాలోని పలు సచివాలయాలు వెలవెలబోగా వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు, సిబ్బంది లేక అవస్థలు పడాల్సి వచ్చింది.

**వారం నుంచి తిరుగుతున్నా.. 1బీ, అడంగల్ ఇచ్చే నాథుడే లేడు**

రైతు గూడూరి మాల్యాద్రి, మెట్లవారిపాలెం, పీసీపల్లి మండలం బ్యాంకులో రుణం తీసుకునేందుకు వారం రోజుల నుంచి 1బీ, అడంగల్ కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నా. పెదయిర్లపాడు సచివాలయానికి వెళ్తే పేపర్లు లేవన్నారు. వెంగళాయపల్లి వెళ్లినా అక్కడా అదే మాట చెప్పారు. చింతగుంపల్లి సచివాలయానికి వస్తే ఇక్కడ ఆ ఉద్యోగే లేరు.

- పొదిలి : పట్టణంలోని సచివాలయం-2లో 11.44 నిమిషాలకు సచివాలయ కార్యదర్శి మాత్రమే హాజరయ్యారు. ఆయన వచ్చి తలుపులు తీస్తున్నారు. ఆసమయంలో విజిట్‌కె వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రశ్నించగా కొందరు సర్వేలో ఉన్నారని, మరికొందరు సెలవులో ఉన్నారని సమాధానం ఇచ్చారు. అదేవిధంగా సచివాలయం-3లో కేవలం కేవలం మహిళాపోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్‌ఫేర్ అసిస్టెంట్ మాత్రమే హాజరైయ్యారు. మిగిలిన వారు విధులకు రాలేదాని ప్రశ్నించగా ఏఎన్ఎం సెలవులో ఉన్నారని మిగిలిన వారు సర్వే ఫీల్డ్ మీదకు వెళ్లినట్లు సమాదానం చెప్పారు. ఇదేవిదంగా అన్నీ సచివాలయాల్లో ఇదేపరిస్థితి నెలకొంది.

- ఒంగోలులో కుటుంబ సమగ్ర సర్వే చేయాలని అధికారులు భావించారు. ఈ మేరకు సచివాలయ సెక్రటరీలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలి. ఆ ప్రక్రియ అంతా కూడా ఉదయం 7 నుంచి 10గంటలలోపు చేపట్టాలి. ఆ తర్వాత యథావిధిగా సచివాలయాలకు వెళ్లాలి. అయితే సిబ్బంది మాత్రం సర్వేల పేరుతో చెక్కేస్తున్నారు. ప్రతి సచివాలయంలో పదిమంది వరకు సెక్రటరీలు ఉండాల్సి ఉండగా, వారు ఒక ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. కార్యాలయంలో ఎవరూ లేకపోతే మరీ బాగుండదు కాబట్టి రోజుకు ఇద్దరు సెక్రటరీలు ఉంటారు. మిగిలిన వారు సర్వేల పేరుతో ఫీల్డులో ఉన్నట్లు చెబుతారు. ఇలా సోమవారం పరిశీలించగా ఎక్కడ చూసినా ఇద్దరు లేకపోతే ఖాళీ కుర్చీలు కనిపించాయి.

- జిల్లాలో సచివాలయాల పనితీరు అస్తవ్యస్తంగా ఉంది. ఈ వ్యవస్థ ఏర్పాటు చేసి ఐదేళ్లు గడుస్తున్నా గాడినపడలేదు. సచివాలయాల పనితీరును పరిశీలన చేసేందుకు సోమవారం ఆంధ్రజ్యోతి బృందం విజిట్ నిర్వహించగా పలు చోట్ల సచివాలయాల్లో సిబ్బంది కనిపించలేదు. చాలాచోట్ల సచివాలయాలకు సిబ్బంది వేళకు రాకపోవడంపై ఆంధ్రజ్యోతి బృందం ఆరాతీయగా కొన్నిచోట్ల హౌస్‌హోల్డ్ సర్వే పేరుతో డుమ్మాకొట్టగా మరి కొన్నిచోట్ల మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణా కార్యక్రమాల కోసంవెళ్లినట్లు తెలిసింది.



కొండాయపాలెంలో తారు రోడ్డుపై నిలిచిన నీరు

## ఇది వాగు కాదు.. తారు రోడ్డు

**కొండాయపాలెంలో దారిలో నిలిచిన నీరు**

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో ప్రదాన రోడ్డు వాగులను తలపిస్తోంది. వ్యర్థ నీరు రోడ్డుపై నిలిచి అలానే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చెన్నుపల్లి అనంతవరం రోడ్డులో ఉన్న కొండాయపా లెం గ్రామంలోని బీసీ కాలనీ ఎదురుగా తారు రోడ్డుపై నీరు వాగులను తలపిస్తోంది. సైడు కాలువలు లేకపోవడం వలన వర్షాలతో కురిసిన నీరు రోడ్డుపైనే ఉంటుందని ప్రజలు తెలిపారు. ఈ రోడ్డులో ప్రయాణించే ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు వెంటనే నడి రోడ్డుపై నిలిచి ఉన్న నీటిని సైడుకు పంపేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# వరికి తుఫాన్ దెబ్బ

**» గాలులకు పడిపోయిన పంట**
**» కాపాడే పనిలో రైతులు**

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షా లు, గాలులతో పడిపోయిన వరి పంటను రక్షించుకోనే పనిలో రైతులని మగ్నం అయ్యారు. మండలం వల్లాపల్లిలో ఏటీసీ కాలు వ దిగువ భాగంలో వరి పంట కోత దశలో ఉంది. పంట కోత కోయకుండానే గాలులు, వర్షాలకు పంట మెత్తం నేలకరించింది. దీం తో రైతులు వరి దుబ్బులను పైకిలేపి వరి గడ్డితో కడుతున్నారు. నేలపై ఉంటే వరి విత్త నాలు నల్లగా వస్తాయని అందుకే ఇలా కొం త పంటను కాపాడుకుంటున్నామని రైతులు తెలిపారు. పంట కోత దశలో ఉండడం వలనే పంట పడి పోయిందని రైతులు తెలిపారు. పడి పోయిన వరి పోలంలో దుబ్బులను పైకి లేపడంతో కొంత విత్తనాలు రాలి పోతున్నాయని కొందరు రైతులు తెలిపారు.



వల్లాపల్లి వద్ద వర్షాలకు పడిపోయిన వరి పంట

మరోసారి అల్పపీడన హెచ్చరిక రైతుల్లో దడ పుట్టిస్తోంది. వానలు పడితే బోరు బావుల కింద వరి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టాలు తప్పవు అని వారు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి ఉదయం నుండే నల్లగా కారుమబ్బులు కమ్మడంతో రైతులు మరింత ఆందోళనలో ఉన్నారు. పోలాల మీద కొందరు రైతులు వరి పంటను కోత కొసి నూర్పిడి చేసేందుకు సిద్ధం అవుతుండగా కొందరు రైతులు కోత కొసి ఉంచారు. కొందరు కోత దశలో ఉన్న పంటను వర్షాలు లేకుంటే కోసేందుకు సిద్ధం అవుతున్నారు.



విద్యార్థులతో కాలేజీ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నిర్వాహకులు

## ఎక్స్‌పోకు చీరాల విద్యార్థుల ప్రాజెక్ట్

చీరాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ స్టేట్ లెవల్ ఎక్స్‌పోకు చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థుల ప్రాజెక్ట్ ఎంపికయినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రాజెక్ట్ తయారు చేసిన ఈసీఈ బ్రాంచి విద్యార్థులు వికాస్, చంద్రమణికంఠ, గౌరీశివ సాయిప్రసాద్, లోకేష్‌ను ఘనంగా సత్కరించారు. ప్రతినిధులు మాట్లాడుతూ ఇటీవల ఒంగోలులోని డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రీజనల్ పాలిటెక్ ఫెస్ట్‌లో విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఆటోమేటిక్ స్టెర్‌కేస్ లైట్ కంట్రోల్ యూజింగ్ ఆర్డినో తయారు చేయగా మొదటి బహుమతి సాధించినట్లు చెప్పారు. ఫెస్ట్‌లో 11 కళాశాలల నుంచి ప్రదర్శనలు రాగా, చీరాల సెయింట్ ఆన్స్ ఆఫ్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించి రూ.25వేల నగదు అందుకున్నట్లు చెప్పారు. అలాగే వీటితో పాటు వివిధ బ్రాంచీలలో ఐదు ప్రాజెక్టులు ప్రదర్శనకు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు, అధ్యాపకులు సీహెచ్ భానుశ్రీ, డిప్యూటీ డైరక్టర్ విజయ భాస్కరరెడ్డి, బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమంగా ముడిరాయి తరలింపు

**లారీలను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు**



బల్లికురవ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రానైట్ ముడిరాయి లారీలు

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పర్మిట్ లేకుండా గ్రానైట్ క్వారీల నుంచి అక్రమంగా కటింగ్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్న నాలుగు ముడి రాయి లారీలను ఆదివారం రాత్రి ఒంగోలు విజిలెన్స్ అర్‌ఐ రాజు పట్టుకున్నారు. సంతమాగులూరు మండలం గురిజేపల్లి గ్రానైట్ క్వారీల నుంచి ముడి రాయితో వస్తున్న నాలుగు లారీలను కొప్పరం గ్రామం వద్ద నిలుపుదల చేసి తనిఖీలు చేయగా పర్మిట్ లేకపోవడంతో వెంటనే సమీపంలో ఉన్న బల్లికురవ పోలీసు స్టేషన్‌కు ఆ లారీలను అప్పగించారు. లారీలను విజిలెన్స్ అధికారులు తమకు అప్పగించారని ఎస్‌ఐ జీవీ చౌదరి తెలిపారు. పట్టుబడి స్టేషన్‌లో ఉన్న లారీలను చీరాల సేల్ ట్యాక్స్ సీటీవో భాస్కరరెడ్డి పరిశీలించారు జీఎస్టీ చెల్లించక పోవడంతో ఆ లారీలకు తమ శాఖ కూడా పెనాల్టీ విధిస్తుందని వారు తెలిపారు.

## నీటి కుంటలో పడి పశువుల కాపరి మృతి

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి పశువుల కాపరి మందా పిచ్చయ్య (30) సోమవారం మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు వల్లాపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మందా రోశయ్య కుమారుడు తనకు ఉన్న పశువులను తీసుకుని మేతకు పొలాలకు వెళ్లాడు. ఉపాధి పథకం కింద గతంలో తీసిన నీటి కుంటలోకి పశువులు నీటి కోసం వెళ్లాయి. వాటిని బయటకు తోలేందుకు పిచ్చయ్య కుంటలోకి దిగడంతో లోతు ఎక్కువగా ఉండటంతో అయన నీటిలో మునిగి అక్కడిక్కడే మృతి చెందాడు. పిచ్చయ్యకు వివాహం కాలేదు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన యువకుడు ఏల్చూరి వెంకటనారాయణ సోమవారం ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. సంతమాగులూరు రోడ్డులో నిలిచి ఉన్న లారీని వెంకటనారాయణ బైక్‌పై వస్తూ ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన అతనిని 108లో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు.

**బైకు అదుపు తప్పి**

మార్టూరు : మండలంలోని జొన్నతాలి సెంటర్ వద్ద సోమవారం బైకు అదుపు తప్పి బోల్తా పడడంతో చంద్రయ్య అనే వ్యక్తి గాయపడ్డాడు. చిలకలూరిపేట మండలం ఏలూరు గ్రామానికి చెందిన చంద్రయ్య బైకుపై ఒంగోలు వెళ్తుండగా బైకు అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. హైవే అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి అనంతరం గుంటూరుకు తరలించారు.

**మోటార్ సైకిలిస్టుకు గాయాలు**

అద్దంకి : ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొనడంతో మోటార్‌సైకిలిస్టుకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. మద్దిపాడు మండలం కొలచనకోటకు చెందిన ఏసుబాబు సోమవారం మోటార్‌సైకిల్‌పై అద్దంకి వస్తూ నల్లవాగు సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. గాయాలైన ఏసుబాబును 108లో అద్దంకి ఆసుపత్రిలో చేర్పించారు.

## వల్లాపల్లి పాఠశాలలో షార్ట్ సర్క్యూట్

**విలువైన కంప్యూటర్ వస్తువులు దగ్ధం**



కాలిపోయిన కంప్యూటర్

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రధానోపాధ్యాయుడు ఉండే గదిలో ఒక్క సారిగా విద్యుత్ వైర్లు నుంచి మంటలు చెలరేగాయి. ఎక్కడో వైర్లు టచ్ అయి షార్ట్ సర్క్యూట్ అయిందని స్థానికులు అంటున్నారు. మంటలలో కంప్యూటర్‌లు, విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. విద్యార్థులు లేని గదిలో ఘ టన జరగడంతో పెనుప్రమాదం తప్పింది.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

అద్దంకి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్టాస్టర్‌లు పాల్గొన్నారు. పాస్టర్‌లు ఆర్.భాస్కర్, చిట్టిబాబు, ఇజ్రాయిల్, సుశీలశర్మ, ప్రసాద్ క్రీస్తు సందేశాలను వినిపించారు. కార్యక్రమంలో టీపీ కృష్ణారెడ్డి, కాకాని అశోక్, శింగయ్య పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న పాస్టర్లు



పూజచేసి పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నేతలు

## కారంచేడు వాటర్ ట్యాంక్ మరమ్మతులు

**ఎమ్మెల్యే చొరవతో రూ.15లక్షల వ్యయంతో పనులు**

కారంచేడు/పర్చూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారంచేడు మంచినీటి పథకానికి సంబంధించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. ఈవియాన్ని తెలుగుదేశం పార్టీ నేతలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే దానికి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.15లక్షల వ్యయంతో దెబ్బతిన్న వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం అధికారులు, పార్టీ నేతల సారథ్యంలో పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రంలో ఎంపీడీవో నేతాజీ, ఈవో సూర్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ కుమార్, సర్పంచ్ శివపార్వతి, ఎంపీటీసీ సభ్యుడు శేషారత్నం, నాయకులు శ్రీరాములు, ప్రహ్లాద, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి

పంగులూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తక్షణమే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ సింగారావుకు రైతు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు, జాన్, సుబ్బారావు, తానికొండ సుధాకరరావు, రావూరి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

**పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి**

మార్టూరు : రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టు బాటు ధరలు కల్పించి గ్రామాలలోనే కొనుగోలు చేయాలని రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మార్టూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం నేతలు ధర్నా చేసి అనంతరం తహ సీల్దార్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు రాంబాబు, హనుమంతురావు, సాంబశివరావు పాల్గొన్నారు

ఇంకొల్లు : స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇంకొల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేసి తహసీల్దార్ వెంకటరత్నంకు వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో యర్రం గోవిందరెడ్డి, భానుప్రసాద్, అన్నెం ఆదయ్య, మాదాల అంజియ్య రైతులు పాల్గొన్నారు.

## అర్జీలను పరిష్కరించాలి

ఇంకొల్లు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు అందజేసిన అర్జీలలో సమస్యల పరిష్కరించే దిశగా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ వెంకటరత్నం అన్నారు. సోమవారం వీఆర్వోలు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన గ్రామ సభలలో అందిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలన్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీ, వాణీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

## నేరాలను విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలి

చీరాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు సత్ప్రవర్తనతో మెలగాలని చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చీరాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ పరిధిలోని ముగ్గురు పాత నేరస్థులను సోమవారం తహసీల్దార్ గోపీకృష్ణ వద్ద హాజరుపరిచారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏడాదికి రూ.లక్షకు బైండోవర్ చేసినట్లు వివరించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించి జైళ్లు పాలు కారాదని సూచించారు.

## పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవారితో మర్యాదగా నడుచుకోవాలి

**డీఎస్పీ మహ్మద్ మొయిన్**

వేటపాలెం/చీరాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారితో అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని డీఎస్పీ మ హ్మద్ మొయిన్ సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా సోమవారం ఆయన వేటపాలెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ శేషగిరి రావు, ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపౌరుడు యూనిఫాం లేని పోలీసేనని, అపరాధ పరిశోధనలో ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు. అందుకు అనుగుణంగా స్నేహ పూర్వక వాతావరణాన్ని మలుచుకోవాల ని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# నాణ్యతతో హైవే పనులు పూర్తి చేయాలి

**» రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి**
**» అధికారులకు ఎమ్మెల్యే ఏలూరి ఆదేశం**



హైవే అథారిటీ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్న హైవే నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో హైవే అథారిటీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పిడుగురాళ్ల - ఓడరేవు హైవే పనులకు సంబంధించి పెండింగ్ వివరాలపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో భాగంగా రైతుల వద్ద నుంచి వచ్చిన విజ్ఞప్తులు, పలు సమస్యలను అధికారులు వివరించి వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఏలూరి మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందు చూపుతో నిర్మాణాలను చేపట్టాలన్నారు. తిమ్మరాజుపాలెం, కారంచేడు గ్రామాల పరిధిలో హైవే అండర్ డ్రైనేజీ పటిష్టంగా ఉండాలని రైతులు కోరిన విధంగా మూడు మీటర్ల నుంచి పది మీటర్లకు పెంచాలని అధికారులను ఆదేశించారు. వరదలు సంభవించినప్పుడు రైతుల పంట భూములకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులతో హైవే ప్రాముఖ్యతను వివరించి ఈప్రాంత అభివృద్ధికి దోహదం చేసే అంశాలను తెలియజేసి రైతుల సమ్మతితో భూములను తీసుకోవాలని సూచించారు. హైవే పక్కన వరద కాలువ నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వరద కాలువ నిర్మాణం చేపడితే రోడ్డు కూడా పటిష్టంగా ఉంటాయన్నారు. ప్రభుత్వ పరంగా ఉన్న సమస్యలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ప్రతి గ్రామంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిమ్మరాజుపాలెం సబ్‌స్టేషన్ వద్ద అండర్ డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. ఉప్పుటూరు వద్ద సువిశాలమైన వెహికల్ అండర్ పాస్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నల్లమడ నుంచి రొంపేరు వరకు డ్రైన్‌లను ఆధునికీకరిస్తామని ఏలూరి స్పష్టం చేశారు. భూములను కోల్పోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. కార్యక్రమంలో హైవే అథారిటీ డీఈ, ఈఈ, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన ధనుర్మాస పూజలు

చినగంజాం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు దేవాలయాల్లో ధనుర్మాస పూజలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయాల అర్చకులు స్వామివార్లను విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు పలు ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. చినగంజాం, భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానం, కడవకుదురు సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామాలయంలో మహిళా భక్తులు తిరుప్పావై కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుప్పావై ప్రాసురాలు జనవరి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వినియోగం చేశారు. ఆలయాభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జ్యోతిర్లింగ దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

చీరాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహా కాళేశ్వర జ్యోతిర్లింగ ఆలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్థల పురాణంను స్థానిక అర్చక స్వాములు వివరించారు. ఆలయ మర్యాదలతో ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే కొండయ్య వెంట ఆయన సతీమణి బాల కొండమ్మ, కుమారులు గౌరీ అమర్నాథ్, టిడిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాద్, కుమార్తె దేవి ఉన్నారు.



ఉజ్జయిని దేవస్థానంలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కొండయ్య



వేలం నిర్వహణ ధ్రువీకరణపత్రం అందుకుంటున్న దేవదాయ శాఖ పరిశీలకులు వేణుగోపాల్‌రావు

## నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానంలో వేలంపాటలు

**» గత ఏడాదికన్నా రూ.5.3.2లక్షలు అదనపు ఆదాయం**
**» మొత్తం రూ.12.84లక్షలకు దక్కించుకున్న పాటదారులు**

వేటపాలెం(చీరాల), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ పరిధిలో వేంచేసి ఉన్న శ్రీకనక నాగవరపమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు వివిధ రకాల సేవలు అందిచేందుకుగాను సోమవారం సంబంధిత దుకాణాల నిర్వహణకు బహిరంగం వేలంపాటను నిర్వహించారు. దేవదాయ శాఖ పరిశీలకుడు వేణు గోపాల్‌రావు సమక్షంలో కొబ్బరి కాయలు, ఇతర పూజా సామగ్రి, అమ్మవారి మొక్కులు చెల్లించిన వస్త్రాలు, తల నీలాలు తదితరాలకు సంబంధించిన వేలం పాటలకు రూ.12.84లక్షలు చెల్లించే విధంగా పాటదారులు పాటలు పాడారు. గతేడాది కన్నా ఈసారి రూ.5.32 లక్షల అదనపు ఆదాయం సమకూరుతున్నట్లు వేణుగోపాల్‌రావు తెలిపారు. వచ్చే యేడాది జనవరి 1వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు పాటదారులు సంబంధిత పాటలకు సంబంధించి భక్తుల నుంచి నిర్ణీత రుసుము వసూలు చేసుకునేందుకు అర్హులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పీ శ్రీనివాసరావు, మంగమూరు ఆలయ ఈవో మద్దినేని శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనే లక్ష్యంగా సర్పంచ్‌లు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమగ్ర అభివృద్ధి లక్ష్యాలపై గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. గ్రామాలలో పేదరిక నిర్మూలన, సదుపాయాల కల్పన, పచ్చదనం - పరిశుభ్రత, ప్రజలకు తాగునీరు, విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధి లక్ష్యాలుగా ఎంచుకొని వాటి సాధన కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమ్మ, ఈవోఆర్డీ సుమంత్, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, సర్పంచ్‌లు, గ్రేడ్-1,4 కార్యదర్శులు, వెల్ఫేర్, అగ్రికల్చర్, ఇంజనీరింగ్, సర్వే, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**ప్రణాళికతోనే అభివృద్ధి**

చినగంజాం : గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేసుకోవాలని శ్రీకేశవరెడ్డి కోర్స్ జాయింట్ డైరెక్టర్, డీఎల్‌డీవో కే.పద్మావతి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్ నందు సుస్థిర అభివృద్ధి నిర్దేశిత లక్ష్యాలపై గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సోమవారం జరిగిన మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం స్థానిక సంస్థల బలోపేతానికి ప్రత్యేకంగా కృషి చేస్తుందని ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.సుబ్బారావు, చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.విజయభాస్కరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలతలు పలు అంశాలపై శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించేదుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీఎం అనూరాధ, పీఆర్ఏఈ ఆనంద్, ఏఈ జ్యోతి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.